RNI No. APTEL/2009/28868

ప్రజల కోసం.. ప్రజల పక్షాన...
నిజం మా నడవడి...

సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

PEOPLE ISSUES OUR MISSION

TRUTH BRINGS A BETTER SOCIETY

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 355 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 30-10- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ॥

VOLUME: 18 | ISSUE : 355 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 30-10-2026 | PAGES: 8 | PRICE : 2/- RS

కొందరు తుపాను హెచ్చరికలను ఎగతాళి చేశారు..

తర్వాత వాస్తవం తెలుసుకున్నారు

అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే

బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా

రెండు రోజుల్లో 100% విద్యుత్ పునరుద్ధరణే లక్ష్యమని ప్రకటన

రూ.4600 కోట్ల ప్రాథమిక నష్టం జరిగిందని కేంద్రానికి నివేదిక

అమరావతి, సిటిజన్ టైమ్స్

"తుపానును మనం పూర్తిగా నివారించలేం. కానీ, మనకు ఉండే ప్రత్యేక పరిస్థితుల్లో దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించాలి. అర్నబ్ తుపానును సమర్థవంతంగా ఎదుర్కొని ఎవరికీ ఇబ్బంది లేకుండా చేసే బాధ్యత తీసుకుంటాను" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'అర్నబ్' తుపాను సృష్టించిన బీభత్సం నేపథ్యంలో గురువారం ఆయన కృష్ణా, పశ్చిమ గోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ చర్యలను, భవిష్యత్ ప్రణాళికలను సుదీర్ఘంగా వివరించారు.

తరువాయి 2లో..

ఏపీలో పెట్టుబడులకు

చైనా సంస్థ ఆసక్తి..

వెంటనే స్పందించిన మంత్రి లోకేశ్

సోషల్ మీడియా ద్వారా

మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లిన నిపుణుడు

వెంటనే స్పందించి అధికారులను రంగంలోకి దించిన లోకేశ్

అమరావతి, సిటిజన్ టైమ్స్

చైనాకు చెందిన ఒక ఎలక్ట్రానిక్స్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో తన తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి కనబరచడంపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. సోషల్ మీడియా వేదికగా ఈ విషయం తన దృష్టికి రాగానే అధికారులను అప్రమత్తం చేశారు. చైనా సోర్సింగ్, లాజిస్టిక్స్ రంగ నిపుణుడు ప్రావిన్ గణేశన్ బుధవారం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్

తరువాయి 2లో..

పరిషత్ ఎన్నికల పోలింగ్ 5న...

ఓట్ల లెక్కింపు 7న

అవసరమైన ప్రాంతాల్లో 6న రీపోలింగ్

సవరించిన షెడ్యూల్ విడుదల

యథావిధిగా పుర ఎన్నికలు

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పునేఠా వెల్లడి

అమరావతి, సిటిజన్ టైమ్స్

పరిషత్ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. వచ్చే నెల 3న నిర్వహించాల్సిన పోలింగ్‌ను 5కు, ఓట్ల లెక్కింపును 5 నుంచి 7కు (రీ షెడ్యూల్) మార్చింది. అవసరమైన చోట్ల 6న రీపోలింగ్ నిర్వహిస్తారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులతో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ తేదీని ఈ నెల 28 నుంచి వచ్చే నెల 1కి, ఓట్ల లెక్కింపును 30 నుంచి 3వ తేదీకి వాయిదా వేసింది. ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 3న ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించాలి. అదే రోజు పట్టణ స్థానిక సంస్థల ఓట్లు లెక్కించాలని నిర్ణయించారు. ఒకే రోజు రెండు ఎన్నికలకు

తరువాయి 2లో..

శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్

'అర్నబ్' తుపాను ప్రభావంతో శ్రీకాకుళం జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో నదులకు వరద పోటెత్తింది. వంశధార, నాగావళి, మహేంద్రతనయ, బాహుదా నదుల్లోకి భారీగా వరదనీరు చేరడంతో పదుల సంఖ్యలో గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మరోవైపు, ఈ తుపాను ప్రభావంతో కోల్కతా - చెన్నై ప్రధాన మార్గంలో ఇచ్ఛాపురం మీదుగా వెళ్లే 12 రైళ్లను అధికారులు రద్దు చేశారు. అలాగే, 8 రైళ్ల రూట్ను మార్పు చేయడంతో పాటు మరో ఎనిమిది రైళ్లను రీషెడ్యూల్ చేశారు. ప్రయాణికులు గమ్యస్థానాలకు వెళ్లడానికి ఇంట్లో బయల్దేరే ముందు తాము ఎక్కబోయే రైలు వివరాలను చెక్ చేసుకోవాలని దక్షిణ కోస్తా రైల్వే అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఒడిశాలో భగలట్టి డ్యామ్ గేట్లు ఎత్తివేయడంతో..

ఎగువన ఒడిశాలోని భగలట్టి డ్యామ్ వద్ద గేట్లు ఎత్తివేయడంతో పాటు భారీ వర్షాలతో ఇచ్ఛాపురం మండలంలో బాహుదా నది ఉగ్రరూపం దాల్చింది. ఇటీవల కాలంలో

తరువాయి 2లో..



ఎంపీటీసీ ఏకగ్రీవాల్లో

కూటమి ప్రభంజనం..

పులివెందులలో క్లీన్‌స్వీప్

స్థానిక పోరులో అధికార కూటమికి భారీ ఆధిక్యం

రాష్ట్రవ్యాప్తంగా 2,043 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం

ఏకగ్రీవాల్లో 95 శాతం స్థానాలు కూటమి కైవసం

జగన్ సొంత నియోజకవర్గం

పులివెందులలో వైసీపీకి చుక్కెదురు

అమరావతి, సిటిజన్ టైమ్స్

ఏకగ్రీవాలతోనే 130 మండల పరిషత్‌లు కూటమి ఖాతాలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (ఎంపీటీసీ) ఎన్నికల్లో అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఏకగ్రీవాల్లో ప్రభంజనం సృష్టించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం రాత్రి ఏకగ్రీవమైన ఎంపీటీసీల

తరువాయి 2లో..

తెలంగాణ ఎదుగుతోంది..

ప్రగతి ప్రస్థానంలో భాగస్వాములు కండి: సీఎం రేవంత్

హైదరాబాద్, సిటిజన్ టైమ్స్

రాజకీయంగా భిన్నాభిప్రాయాలున్నప్పటికీ.. హైదరాబాద్ పెట్టుబడుల ప్రస్థానానికి అంతా మద్దతుగా నిలిచారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 7, 8, 9 తేదీల్లో జరిగే గ్లోబల్ సమిట్ కోసం దిల్లీలోని తాజ్ ప్యాలెస్లో ఏర్పాటు చేసిన సన్నాహక సదస్సులో పాల్గొన్న సీఎం.. సమిట్కు అందరినీ ఆహ్వానించారు.

400 ఏళ్ల క్రితమే ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్..

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "సుమారు 400 ఏళ్ల క్రితమే హైదరాబాద్ ఒక ప్రపంచ స్థాయి నగరంగా వెలుగులీనింది. ప్రపంచంలోని అనేక దేశాల నుంచి వ్యాపారులు హైదరాబాద్లోని చార్మినార్ పరిసరాలకు వచ్చి వ్యాపారాలు చేసేవారు. ముత్యాలు, సుగంధ ద్రవ్యాలు, వెండి నకాషీ కళాకృతులను కొనుగోలు చేసేవారు. నిజాం పాలకులు అద్భుతమైన కట్టడాలు, ప్రపంచస్థాయి మ్యూజియం, టంకశాల (నాణేల ముద్రణాలయం), విమానాశ్రయం, రైల్వేలు, అత్యుత్తమ విద్యా సంస్థలతో హైదరాబాద్ను అభివృద్ధి చేశారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రపంచం గర్వించే మేధో నిపుణులు, నాయకులను అందించింది. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా, అడోబ్ సీఈవో శంతను నారాయణ్, ప్రేమ్ వత్స వంటి ప్రముఖులంతా ఇక్కడ చదువుకున్నవారే. విదేశీ

తరువాయి 2లో..

అర్నబ్ తుపాను అనంతర చర్యలు.. రంగంలోకి దిగిన పవన్!

అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల వేగవంతం

అంటువ్యాధుల నివారణకు పవన్ కల్యాణ్ ఆదేశాలు

9 జిల్లాల నుంచి 475 మంది సిబ్బందితో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు

అమరావతి, సిటిజన్ టైమ్స్

అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో

తరువాయి 2లో..

ఎడిటోరియల్

జనసేన అంతంతమాత్రం..

స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు హాట్ టాపిక్ అవుతోంది. నామినేషన్లకు ముందు తమకు భారీగా సీట్లు కావాలని, బలం ఉన్న ప్రతిచోటా పోటీ చేస్తామని గంభీరమైన ప్రకటనలు చేసిన బీజేపీ, జనసేన పార్టీలు తుది లెక్కలకు వచ్చేసరికి తేలిపోయినట్లు కనిపిస్తున్నాయని అంటున్నారు. ప్రధానంగా తమకు 30 శాతం వాటా ఇవ్వాలని హడావుడి చేసిన జనసేన నేతలు, గ్రామాల వరకు వచ్చేసరికి చేతులెత్తేశారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇక బీజేపీ అయితే అక్కడక్కడ మాత్రమే పోటీలో నిలబడి తానూ ఉన్నానని చాటుకునే ప్రయత్నం మాత్రమే చేసిందని వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తంగా కూటమిలో ప్రధాన పక్షం టీడీపీ హవానే ఎక్కువగా ఉందని ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితా స్పష్టం చేస్తోందని చెబుతున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ఎన్నికల సంఘం వెల్లడించింది. ఏకగ్రీవాలు మినహాయిస్తే పోటీ జరుగుతున్న మొత్తం స్థానాల్లో టీడీపీ 6,423 ఎంపీటీసీ స్థానాల్లో బరిలో నిలిచింది. అంటే మొత్తం స్థానాల్లో 65 శాతం టీడీపీ వాటాగా చెబుతున్నారు. ఇదే సమయంలో జనసేన 1,521 చోట్ల ఎంపీటీసీ అభ్యర్థులను నిలిపి 15 శాతంతో సరిపెట్టుకుందని అంటున్నారు. అదేవిధంగా బీజేపీ కేవలం 285 స్థానాల్లో మాత్రమే పోటీ చేస్తోంది. సుమారు 2.90 శాతం వాటా మాత్రమే తీసుకుందని విశ్లేషిస్తున్నారు. ఇక జడ్పీటీసీ స్థానాల్లో టీడీపీ 452, జనసేన 109, బీజేపీ 34 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. వరుసగా మూడు పార్టీలు 68.59 శాతం, 16.54 శాతం, 5.16 శాతం స్థానాలు తీసుకున్నాయని చెబుతున్నారు. రాష్ట్రంలో మొత్తం 9829 ఎంపీటీసీ స్థానాలు, 659 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగితే, 1985 ఎంసీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అదేవిధంగా 77 జడ్పీటీసీ స్థానాలు పోటీ లేకపోవడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ స్థానాలు మినహాయిస్తే 7844 ఎంపీటీసీ స్థానాలు, 582 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఇందులో టీడీపీ అత్యధికంగా 6423 చోట్లో పోటీ చేస్తూ కూటమిలో తమ పార్టీకి ఎదురులేనట్లు సంకేతాలిచ్చింది. ఇదేసమయంలో జనసేన, బీజేపీ నేతలు పొత్తుల్లో వెనకబడినట్లు పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో నిర్ణయించిన నిష్పత్తి ప్రకారం క్షేత్రస్థాయిలో సీట్లు సర్దుబాటు జరగాలని మూడు పార్టీల అగ్ర నాయకత్వం నుంచి సూచనలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు కారణంగా అమలు చేయలేకపోయారని అంటున్నారు. ప్రధానంగా జనసేన, బీజేపీకి క్షేత్రస్థాయిలో సమర్థులైన నాయకుల కొరత, ప్రత్యర్థుల నుంచి గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం కారణంగా టీడీపీ అడ్వాంటేజ్ తీసుకున్నట్లు చెబుతున్నారు. స్థానిక ఎన్నికల్లో తమ బలం ఉన్న ప్రతిచోట పోటీ చేస్తామని హడావుడి చేసిన జనసేన నేతలు జడ్పీ, మండల పరిషత్ ఎన్నికల్లో వెనక్కి తగ్గడంపై విస్తృత చర్చ జరుగుతోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో జనసేన నుంచి 15 నుంచి 16 శాతం మాత్రమే నామినేషన్లు వేయడం చూస్తే క్షేత్రస్థాయిలో ఆ పార్టీ ఇంకా పుంజుకోలేదన్న విషయాన్ని బయటపెడుతోందని అంటున్నారు. కేడర్ గట్టిగా ఉన్న చోట మాత్రమే జనసేన అభ్యర్థులకు అవకాశం ఇచ్చారని, అంతంత మాత్రం ప్రజాదరణ ఉన్న వారికి, ఆర్థిక బలం లేనివారికి అస్సలు అవకాశం ఇవ్వలేదని అంటున్నారు. ప్రత్యర్థుల నుంచి గట్టిపోటీ ఉండటం వల్ల అర్థబలం, అంగబలం బేరీజు వేయడం వల్ల జనసేన నాయకులు ఎక్కువ చోట్ల వెనక్కి తగ్గాల్సివచ్చిందని అంటున్నారు. ఇక బీజేపీ పరిస్థితి మరింత తీసికట్టుగా ఉందని అంటున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ పదవులపై చూపిన మక్కువ క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణ కోసం ప్రదర్శించకపోవడం వల్ల స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీ గట్టిగా వాదించలేని పరిస్థితి నెలకొందని అంటున్నారు. ఈ కారణంగానే సీట్ల సర్దుబాటులో జనసేన, బీజేపీ నాయకులను ఆత్మరక్షణలోకి నెట్టేసి టీడీపీ పైచేయి సాధించిందని విశ్లేషిస్తున్నారు.

పరిషత్ ఎన్నికల పోలింగ్ 5న...

ఓట్ల లెక్కింపు 7న

సంబంధించిన విధుల నిర్వహణకు పోలీసు, పోలింగ్ సిబ్బంది సరిపోని కారణంగా పరిషత్ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలను వాయిదా వేసినట్లు పునేఠా స్పష్టం చేశారు. పరిషత్ ఎన్నికలను సమర్థంగా, సజావుగా నిర్వహించేందుకు పోలింగ్, ఓట్ల లెక్కింపు వాయిదా దోహదం చేస్తుందని ఎస్ఈసీ అభిప్రాయపడ్డారు. పరిషత్ పోలింగ్ 5న ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5కు ముగుస్తుందన్నారు. 7న ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభవుతుందని, అదేరోజు ఫలితాలు వెల్లడిస్తారని వివరించారు.

ఆ జిల్లాల్లో పోలింగ్ సమయం కుదింపు

అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు వచ్చే నెల 5న పోలింగ్ సాయంత్రం 5కు బదులు మధ్యాహ్నం 3 గంటలకే ముగుస్తుందని ఎస్ఈసీ తెలిపారు. కొండలపై ఉన్న గ్రామాల నుంచి బ్యాలట్ బాక్సులను తిరిగి వెనక్కి తీసుకురావడానికి రవాణా పరంగా ఉన్న ఇబ్బందులు, ఇతరత్రా సమస్యలను దృష్టిలో పెట్టుకుని రెండుగంటల ముందే పోలింగ్ ముగించాలని కలెక్టర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు. అల్లూరి జిల్లాలో 10 మండలాల్లోని 44 పోలింగ్ కేంద్రాల్లో, పోలవరం జిల్లాలోని ఏడు మండలాల్లోని 44 పోలింగ్ కేంద్రాల్లో మధ్యాహ్నం 3కే పోలింగ్ ముగుస్తుందని వివరించారు. మున్సిపల్ ఎన్నికల తేదీల్లో మార్పు లేదు

వచ్చే నెల 1న మున్సిపల్ ఎన్నికల పోలింగ్, 3న ఓట్ల లెక్కింపు యథావిధిగా ఉంటాయని ఎస్ఈసీ తెలిపారు. తేదీల్లో ఎలాంటి మార్పులూ ఉండవని స్పష్టంచేశారు. అర్నబ్ తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో పునేఠా బుధవారం మాట్లాడారు. పరిస్థితిని అంచనా వేసిన తర్వాత మున్సిపల్ ఎన్నికలు వాయిదా వేయాల్సిన అవసరం లేదనే నిర్ణయానికి వచ్చినట్లు వివరించారు.

ములకలచెరువు సీఐగా రాజారెడ్డి

విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అన్నమయ్య జిల్లా ములకలచెరువు సీఐ కె.దస్తగిరి, ఎస్ఐ పి.రామకృష్ణలను ఎన్నికల విధుల నుంచి ఎస్ఈసీ తప్పించింది. కర్నూలు రేంజ్ డీఐజీ ఇచ్చిన నివేదిక మేరకు ఎస్ఈసీ నిర్ణయం తీసుకుంది. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక విభాగం సీఐ కె.రాజారెడ్డి, మదనపల్లె ఎస్ఐ జి.చంద్రమోహన్‌లను ఆ స్థానాల్లో నియమించింది.

బాహుదా ఉగ్రరూపం..

ఎన్నడూ లేనంతగా నదిలో వరద ప్రవహిస్తోంది. బాహుదా నదికి మూడో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. చెన్నై–కోల్కతా హైవే పైకి భారీగా వరద చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. లొద్దపుట్టిలో నడుము లోతు వరద ప్రవహిస్తుండంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. సోంపేట మండలం లక్కవరం పరిసరాల్లో భారీ వర్షాలకు పంటలు నీట మునిగాయి. ప్రధాన రహదారిపైకి నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. జిల్లాలోని నదీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. నేడు కూడా జిల్లాలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. మరో రెండు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

గొట్టా బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

హిరమండలంలో గొట్టా బ్యారేజీ వద్ద వంశధార ఉధ్ధృతి క్రమంగా పెరుగుతోంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నదిలోకి వస్తున్న వరదను అధికారులు దిగువకు పంపిస్తున్నారు. మహేంద్ర తనయ నదిలోనూ వరద పెరుగుతోంది. పాతపట్నం మండలం చంగుడి, కె.గోపాలపురం, అచ్యుతాపురం గ్రామాల్లోకి వరద నీరు చేరుతోంది.

పలు రైళ్లు రద్దు.. హెల్ప్ డెస్క్ ఏర్పాటు

తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలతో ఇచ్ఛాపురం – సోంపేట మధ్య రైల్వే ట్రాక్ పైకి భారీగా వరదనీరు చేరింది. ముందస్తు చర్యల్లో భాగంగా పలు రైళ్లను రద్దు చేసిన అధికారులు.. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్లో హెల్ప్ డెస్కు ఏర్పాటు చేశారు. సమాచారం కోసం ప్రయాణికులు 08942 286213, 08942 286245 నంబర్లను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

కొందరు తుపాను హెచ్చరికలను ఎగతాళి చేశారు..

తర్వాత వాస్తవం తెలుసుకున్నారు

ముందస్తు చర్యలతో ప్రాణనష్టం తగ్గించాం

గతంలో 1977 దివిసీమ తుపాను, 1996 కోనసీమ తుపాను సృష్టించిన విధ్వంసాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, ఆ అనుభవాలతో ఈసారి పటిష్టమైన ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. “ఈసారి ఒకే ఒక్క టార్గెట్ పెట్టుకున్నాను, ప్రాణనష్టం సున్నాగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నా. దురదృష్టవశాత్తు ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. టెక్నాలజీని ఉపయోగించి తుఫాను గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేశాం. రాత్రంతా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ విభాగాలను మోహరించాం. ఏ ప్రాంతంలో ఎంత తీవ్రత ఉంటుందో నిమిష నిమిషానికి సమాచారం అందించాం. దీనివల్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించి ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం” అని ఆయన వివరించారు. కొంతమంది తుపాను హెచ్చరికలను ఎగతాళి చేశారని, కానీ తీవ్రత పెరిగాక వాస్తవం గ్రహించారని అన్నారు.

30 ఏళ్ల కిందటి జ్ఞాపకాలు కళ్లముందు..

ఈ సందర్భంగా 30 ఏళ్ల క్రితం 1996లో వచ్చిన తుఫాను నాటి భయానక పరిస్థితులను చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. “ఆ రోజు నా కళ్ల ముందు ఆ దృశ్యాలు ఇంకా కదలాడుతున్నాయి. అప్పుడు ప్రైవేట్ ఫ్లైట్స్ లేవు, డిఫెన్స్ విమానంలో వచ్చాను. ఆర్మీ హెలికాప్టర్ సిబ్బంది ప్రాణాపాయం ఉంటుందని నన్ను తీసుకెళ్లలేమని చెప్పినా, నేను బలవంతం చేసి వెళ్లాను. రోడ్డు మీద దిగి మత్స్యకార గ్రామాలను చూస్తే భయంకరమైన దృశ్యాలు కనిపించాయి. ముమ్మిడివరం, అమలాపురంలో దిగి ప్రజలకు ధైర్యం చెప్పి, రాజమండ్రి ఆర్డీవో ఆఫీసునే సెక్రటేరియట్‌గా మార్చి, ప్రతి మండలానికి ఒక సెక్రటరీని నియమించి వారం రోజుల్లో సాధారణ పరిస్థితులు తీసుకొచ్చాం. ఆనాటి పరిస్థితులతో పోలిస్తే, ఈరోజు టెక్నాలజీ సాయంతో వేగంగా స్పందించగలుగుతున్నాం” అని ఆయన తెలిపారు.

వెయ్యి మందిని పంపమని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరాను

తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15,000 విద్యుత్ స్తంభాలు దెబ్బతింటాయని అంచనా వేయగా, ఒక్క కోనసీమలోనే 8,000 స్తంభాలు నేలకూలాయని చంద్రబాబు తెలిపారు. “తుపాను తీరం దాటిన వెంటనే చెట్లను తొలగించే పనులు ప్రారంభించాం. ఈరోజు మారుమూల గ్రామాలకు కూడా రోడ్లు క్లియర్ చేశాం. విద్యుత్ పునరుద్ధరణే ఇప్పుడు మా ముందున్న ప్రధాన సవాలు. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి 1000 మంది సిబ్బందిని పంపమని కోరాను. అవసరమైతే తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అదనపు సిబ్బందిని తెప్పిస్తాం. ఎల్లుండిలోగా ప్రతి ఇంటికి 100% విద్యుత్ ఇచ్చే బాధ్యత తీసుకుంటాం” అని ఆయన హామీ ఇచ్చారు. టెలికమ్యూనికేషన్ సిగ్నల్స్‌కు అంతరాయం కలగకుండా జనరేటర్లు, డీజిల్ సిద్ధం చేసుకోవాలని ఆపరేటర్లకు సూచించినా, కొందరు నిర్లక్ష్యం చేశారని, వారికి అవసరమైతే ప్రభుత్వమే డీజిల్ ఖర్చులు భరిస్తుందని చెప్పామని అన్నారు.

నష్టపరిహారంపై స్పష్టమైన హామీ

తుపాను వల్ల ప్రాథమికంగా రూ. 4,600 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. “కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడాను. ఆయన స్వయంగా ఫోన్ చేసి శుక్రవారం కేంద్ర బృందాన్ని పంపిస్తానని చెప్పారు. ప్రాథమిక నష్టాల నివేదికను కేంద్రానికి పంపాం. కేంద్ర బృందం పర్యటన తర్వాత పూర్తిస్థాయి నివేదిక అందించి సహాయం కోరతాం” అని తెలిపారు. బాధితులకు అందించే పరిహారంపై స్పష్టత ఇస్తూ, “కొబ్బరి, ఆయిల్ పామ్ చెట్టుకు రూ. 1,500 చొప్పున పరిహారం అందిస్తాం. పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు వెళ్లే ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, ఇతర నిత్యావసరాలతో కూడిన ప్యాకేజీతో పాటు కొంత నగదు కూడా అందిస్తాం. వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టం జరగకుండా ఆదుకుంటాం. ఈసారి పంటలకు బీమా కూడా చేయించాం కాబట్టి దిగుబడి తగ్గినా పరిహారం అందుతుంది” అని భరోసా ఇచ్చారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ, ఎన్నికలకు, సహాయక చర్యలకు సంబంధం లేదని, విపత్తు వచ్చినప్పుడు ప్రజలను ఆదుకోవడం తన బాధ్యత అని అన్నారు. గత ‘మొంథా’ తుపాను పరిహారంపై మాట్లాడుతూ, అర్హులైన ప్రతి రైతుకు నష్టపరిహారం అందిందని, ఈసారి కూడా పక్కాగా అంచనాలు వేసి త్వరలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో తుఫానులను తట్టుకునేలా కోస్తా తీరంలోని కీలక ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేసే ఆలోచన ఉందని చంద్రబాబు వెల్లడించారు.

అర్నబ్ తుపాను అనంతర చర్యలు..

రంగంలోకి దిగిన పవన్!

అంటువ్యాధులు ప్రబలకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని, ప్రజారోగ్యం విషయంలో ఎలాంటి ఆపద తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు త్వరగా నెలకొనేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలను వేగంగా అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 9 జిల్లాల నుంచి మొత్తం 475 మంది సిబ్బందితో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, పర్యావరణ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటాయి. అదేవిధంగా, తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక వాటర్ టెస్టింగ్ బృందాలను కూడా రంగంలోకి దించారు. నీటి ద్వారా వ్యాధులు ప్రబలకుండా నివారించడం, పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచడంపై ఈ బృందాలు దృష్టి సారిస్తాయి.

మొదటి పేజీ తరువాయి

ఎంపీటీసీ ఏకగ్రీవాల్లో

కూటమి ప్రభంజనం..

వివరాలను వెల్లడించింది. మొత్తం 9,829 ఎంపీటీసీ స్థానాలకు గాను 1,985 స్థానాలు ఏకగ్రీవమైనట్లు ఎస్ఈసీ తెలిపింది. వీటిలో సింహభాగం కూటమి ఖాతాలోకే చేరాయి. మరో 58 ఎంపీటీసీ స్థానాలు కూడా కూటమి పరం కానున్నాయని అంచనా వేస్తున్నారు.మొత్తం 9,829 ఎంపీటీసీ స్థానాలకు గాను 20.78 శాతం, అంటే 2,043 స్థానాలు ఏకపక్షంగా ముగిశాయి. వీటిలో అధికార కూటమి ఏకంగా 1,934 స్థానాలను (94.66 శాతం) కైవసం చేసుకుంది. ఇందులో టీడీపీ 1,781, జనసేన 101, బీజేపీ 52 స్థానాలను దక్కించుకున్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ కేవలం 93 స్థానాలకే పరిమితం కాగా, ఇతరులు 16 చోట్ల విజయం సాధించారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత గడ్డపై కూటమి భారీ ఆధిక్యం సాధించింది. జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందులలోని 7 మండలా ల్లోని 65 ఎంపీటీసీ స్థానాలకు గాను, 64 స్థానాలను కూటమి ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. అలాగే, కడప జిల్లా వ్యాప్తంగా ఉన్న 413 స్థానాలకు గాను కూటమి 338 స్థానాలు సాధించగా, వైసీపీ కేవలం 9 స్థానాలకే పరిమితమైంది. పల్నాడు జిల్లాలోనూ ఇదే హవా కొనసాగింది. అక్కడ 419 స్థానాలకు గాను 382 ఏకగ్రీవం కాగా, వాటిలో అత్యధికం కూటమికే దక్కాయి.ఈ ఏకగ్రీవ ఫలితాలతో రాష్ట్రంలోని 659 మండల పరిషత్‌లలో సుమారు 130 పరిషత్‌లు పోలింగ్ జరగకుండానే కూటమి ఖాతాలో చేరనున్నాయి. కాగా, కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో టీడీపీ, వైసీపీ మధ్య కుదిరిన అవగాహన మేరకు కొన్ని స్థానాలను పంచుకున్నట్లు సమాచారం.

తెలంగాణ ఎదుగుతోంది..

పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయ స్థాయి ప్రతిభావంతులను తయారు చేయడంలో హైదరాబాద్కు ప్రత్యేకత ఉంది. భారతదేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు సిద్ధమవుతున్న ఈ తరుణంలో.. దేశ ఆర్థిక ప్రగతికి బాటలు వేసిన మహా నేతలను మనం స్మరించుకోవాలి. ఈరోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారుల సమక్షంలో నిలబడి, దేశ ప్రగతికి బాటలు వేసిన ఆ మహానేతలకు సెల్యూట్ చేస్తున్నా. అతి పిన్న వయసులో ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ల రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. నేడు ఫోన్, ఇంటర్నెట్ లేని జీవితాన్ని మనం ఊహించలేం. రాజీవ్ గాంధీ హైదరాబాద్లో పైలట్ శిక్షణ పొంది.. పైలట్గా కూడా పనిచేశారు. అందుకే హైదరాబాద్లోని ప్రపంచస్థాయి విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టుకున్నాం.

మీ పెట్టుబడులకు భద్రత కల్పిస్తాం..

తెలంగాణకు చెందిన పీవీ నరసింహారావు 1991లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో భారత్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆ సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించేందుకు ఆయన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్పీజీ) సంస్కరణలను అమలు చేశారు. హైదరాబాద్ జీవనంలోనే ప్రపంచస్థాయి దృక్పథం ఉంది. సంస్కరణలను స్వీకరించే తత్వం, పారిశ్రామిక స్ఫూర్తి ఉన్నాయి. తెలంగాణలో మీరు పెట్టే పెట్టుబడులకు భద్రత కల్పించడం, అవి వృద్ధి చెందేలా చూడడం నా వ్యక్తిగత బాధ్యత. మీ పెట్టుబడులకు సంరక్షకుడిగా ఉంటా. మీరు తెలంగాణలో ఎంత పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారో ముందుగా మీ మనసులో ఒక సంఖ్యను నిర్ణయించుకుని.. ఆ మొత్తాన్ని ఇప్పుడు రెట్టింపు చేయండి. విధానపరమైన నిర్ణయాలైనా, ప్రభుత్వ సహకారమైనా, మీకు అవసరమైన మద్దతు అందించే బాధ్యతను నేను తీసుకుంటా.

కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సహకరిస్తోంది

‘తెలంగాణ రైజింగ్ 2047’ రాష్ట్ర భవిష్యత్ ప్రణాళిక. ఇది ‘వికసిత్ భారత్ 2047’ లక్ష్యానికి అనుగుణంగా ఉంది. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగితే, అందులో తెలంగాణ వాటా 10 శాతంగా ఉండాలి. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉంది. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నదే నా లక్ష్యం. దేశంలో ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వాటిలో మూడు హైదరాబాద్కు అనుసంధానం కానున్నాయి. హైదరాబాద్ – చెన్నై, హైదరాబాద్ –బెంగళూరు, హైదరాబాద్ –పుణె మార్గాల్లో ఈ కారిడార్లు ఏర్పాటు కానున్నాయి. వరంగల్, ఆదిలాబాద్లలో రెండు కొత్త విమానాశ్రయాల నిర్మాణం ద్వారా కూడా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సహకరిస్తోంది. రీజినల్ రింగ్ రోడ్డు నుంచి మెట్రో రైలు విస్తరణ వరకు, నేవీ రాడార్ కేంద్రం నుంచి అనేక ఇతర అభివృద్ధి కార్యక్రమాల వరకు కేంద్రం నుంచి సహకారం పొందుతున్నాం. హైదరాబాద్.. ఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు వంటి నగరాలతో పోటీ పడదు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ పడాలి. తెలంగాణ అభివృద్ధికి మీ అత్యుత్తమ ఆలోచనలను అందించండి. తెలంగాణ ఎదుగుతోంది.. ఈ ప్రగతి ప్రస్థానంలో మీరూ భాగస్వాములు కండి. మనమంతా కలిసి ఎదుగుతూ చరిత్ర సృష్టిద్దాం” అని సీఎం రేవంత్రెడ్డి అన్నారు.

ఏపీలో పెట్టుబడులకు

చైనా సంస్థ ఆసక్తి..

చేశారు. దక్షిణ భారతదేశంలో అసెంబ్లీ, ప్రొడక్షన్ లైన్ ఏర్పాటు కోసం షెన్‌జెన్‌కు చెందిన ఒక ఎలక్ట్రానిక్స్ సంస్థ తనను సంప్రదించిందని ఆయన పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో, అనుమతులను వేగంగా మంజూరు చేయడంలో, సులభతర వాణిజ్యంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందని తాను ఆ సంస్థకు సూచించినట్లు వివరించారు. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్‌ను ట్యాగ్ చేస్తూ, అనే హ్యాష్‌ట్యాగ్‌లను ఆయన జత చేశారు.దరు పోస్ట్‌పై లోకేశ్ తక్షణమే స్పందించారు. “ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై మీరు ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు” అని బదులిస్తూ.. రాష్ట్రంలో పెట్టుబడులకు సింగిల్ విండో విధానం ద్వారా సేవలందించే ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఏపీ – ఈడీబీ) అధికారులను వెంటనే రంగంలోకి దించారు. సదరు కంపెనీ ప్రతినిధులతో సంప్రదింపులు జరపాలని అధికారులను ఆయన ఆదేశించారు.

విశాఖ అభివృద్ధికి కూటమి విజయం కీలకం: గంటా శ్రీనివాసరావు

జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపు

భీమిలి సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29:
విశాఖపట్నం ప్రగతిని నిర్దేశించే జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులందరినీ అధిక మెజారిటీతో గెలిపించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంతో పాటు జీవీఎంసీలోనూ కూటమి అధికారంలో ఉంటే నగరాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో విశాఖకు ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి కృషి జరుగుతోందని పేర్కొన్నారు. గతంలో హుద్హుద్ తుపాను సమయంలో విశాఖలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించిన విషయాన్ని గుర్తుచేశారు. జీవీఎంసీ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణితో పాటు కూటమి కార్పొరేటర్ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి, భీమిలి టీడీపీ ఇన్చార్జి చిక్కాల విజయ్ బాబు, జనసేన ఇన్చార్జి పంచకర్ల సందీప్, బీజేపీ ఇన్చార్జి జీరు కైలాష్ రెడ్డి, పలువురు

కార్పొరేటర్ అభ్యర్థులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భీమిలి బీచ్ కోత నివారణకు చర్యలు తీసుకుంటాం

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కోతకు గురైన భీమిలి బీచ్ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం సందర్శించారు. సముద్రపు అలల ఉద్ధృతితో నీరు రహదారి వరకు చేరిన పరిస్థితిని స్థానికులు ఆయనకు వివరించారు. బీచ్ ప్రాంతంలో కోత నివారణకు అవసరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్తానని గంటా తెలిపారు. ఇందుకోసం మంజూరైన నిధులను త్వరగా విడుదల చేయించి పనులు ప్రారంభించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిక్కాల విజయ్ బాబు, గొలగాని నరేంద్ర, గరే సదానంద, గాడు చిన్ని కుమారి లక్ష్మి, గంటా నూకరాజు, కె. రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 2వ వార్డులో వైసీపీ ప్రచార పరిశీలకుడిగా జీరు వెంకట్ రెడ్డి

భీమిలి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29
జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో భీమిలి 2వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో వార్డు ప్రచార పరిశీలకుడిగా నియమితులైన జీరు వెంకట్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీరు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ కన్వీనర్ బొత్స అనూష ఆదేశాల మేరకు తనకు ప్రచార పరిశీలకుడిగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందని, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని ఆయన విమర్శించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బింగి హరి కిరణ్ రెడ్డి, నియోజకవర్గ మహిళా కన్వీనర్ డబ్బీరు ప్రశాంతి, వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపిస్తే నగరాభివృద్ధికి బాటలు

విశాఖపట్నం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29:
కూటమి అభ్యర్థులకు ఓటు వేస్తే అభివృద్ధికి ఓటు వేసినట్లేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. జీవీఎంసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం విశాఖ నగరంలోని 88వ వార్డు గొంతినవానిపాలెం, 98వ వార్డు శ్రీనగర్, 85వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో నియోజకవర్గ ఇన్చార్జి కరణంరెడ్డి నరసింగరావుతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి ప్రజాప్రతినిధులు ఉంటే అభివృద్ధి పనులను సమన్వయంతో చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 88వ వార్డు కూటమి అభ్యర్థి సిరసపల్లి నూకరాజు, 98వ వార్డు అభ్యర్థి దేనంకొండ కృష్ణంరాజు, 85వ వార్డు అభ్యర్థి గొర్రపాటి సునీతలను గెలిపించాలని కోరారు. అలాగే మేయర్ అభ్యర్థి డాక్టర్ ముక్కా శ్రావణికి మద్దతు ఇవ్వాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతిపై పోరుకు విద్యార్థుల్లో చైతన్యం కల్పించాలి

విజిలెన్స్ వారోత్సవాల్లో ఏసీబీ అవగాహన సదస్సులు

విశాఖపట్నం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29:
సమాజంలో అవినీతిని అరికట్టి, అవినీతి రహిత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏసీబీ అడిషనల్ ఎస్పీ ఎస్.ఆర్. హర్షిత, డీఎస్పీలు రమణమూర్తి, పృథ్వీ తేజ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఏసీబీ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని మారికవలస ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల, శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, మారికవలస ప్రభుత్వ గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవినీతి వల్ల కలిగే నష్టాలు, అవినీతి నిర్మూలనలో ప్రతి ఒక్కరి బాధ్యతను వివరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగినా, అవినీతికి పాల్పడినా ప్రజలు భయపడకుండా ఏసీబీకి ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. లంచం అడిగితే 1064 టోల్ఫ్రీ నంబర్కు ఫోన్ చేయవచ్చని, 94404 40057 వాట్సాప్ నంబర్తో పాటు కంప్లైంట్స్- ఏసీబీ ఏపీ .గవర్నమెంట్ .ఇన్ ఈమెయిల్ ద్వారా కూడా ఫిర్యాదులు అందించవచ్చని ఏసీబీ అడిషనల్ ఎస్పీ ఎస్.ఆర్. హర్షిత తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏసీబీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఆస్తుల పరిరక్షణకు తెలుగు శక్తి పోరాటం

వరుదు కళ్యాణిని గెలిపించాలని బి.వి.రామ్ పిలుపు

భీమిలి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29:
విశాఖపట్నం ప్రజా ఆస్తుల పరిరక్షణ, ప్రజల హక్కుల సాధన కోసం తెలుగు శక్తి నిరంతరం పోరాడుతుందని ఆ సంస్థ అధినేత బి.వి.రామ్ స్పష్టం చేశారు. గురువారం తగరపువలస, భీమిలి ప్రాంతాల్లో వైఎస్సార్సీపీ మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణి, కార్పొరేటర్ అభ్యర్థుల విజయాన్ని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా భూములు, ప్రభుత్వ ఆస్తులు, అభివృద్ధి నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలని, అక్రమాలపై నిష్పక్షపాత విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విశాఖ అభివృద్ధి అంటే రహదారులు, భవనాల నిర్మాణమే కాకుండా పేదలకు న్యాయం, యువతకు ఉపాధి, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడం కూడా అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన సంక్షేమ హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. గ్యాస్ సబ్సిడీ సహా ఇతర హామీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్నబ్ తుఫాను కారణంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం, న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. జీవీఎంసీ ఎన్నికల్లో టీడీపీ మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి డమ్మీ అభ్యర్థి మాత్రమేనని బి.వి.రామ్ ఆరోపించారు. నగర సమగ్రాభివృద్ధి కోసం వైఎస్సార్సీపీ మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ రెండో వార్డు వైఎస్సార్సీపీ కార్పొరేటర్ అభ్యర్థి అక్కరమాని రామునాయుడు, జీరు వెంకటరెడ్డి, బింగి హరికిరణ్రెడ్డి, డబ్బీరు ప్రశాంతి పట్నాయక్, చిప్పాడ వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల సమరానికి కూటమి సమాయత్తం

మాధవ్తో గంటా భేటీ.. క్షేత్రస్థాయిలో మూడు పార్టీల సమన్వయంపై చర్చ

భీమిలి పరిధిలో 12 జీవీఎంసీ వార్డులు, 3 జెడ్పీటీసీ, 44 ఎంపీటీసీ స్థానాలపై ప్రత్యేక దృష్టి

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్:
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో విశాఖ జిల్లాలో కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల సమన్వయం, సీట్ల సర్దుబాటు తదితర అంశాలపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జనసేన రూరల్ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్బాబు చర్చించారు. ఎంవీపీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ సమావేశంలో జీవీఎంసీతో పాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కూటమి స్ఫూర్తితో పనిచేసేలా క్షేత్రస్థాయిలో సమన్వయాన్ని పెంచుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.

అభివృద్ధి, సంక్షేమమే ప్రచార అస్త్రాలు

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని కూటమి నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వానికి ప్రజల నుంచి మద్దతు ఉందని, అది ఎన్నికల్లో ప్రతిఫలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖపట్నానికి గూగుల్, ఐటీ, పర్యాటక రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులు వస్తున్న నేపథ్యంలో యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని వివరించారు.

సీట్ల సర్దుబాటుపై అసంతృప్తికి చెక్ పెట్టే యత్నం

అభ్యర్థుల జాబితా ప్రకటించే వరకు కొన్ని ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తల మధ్య సీట్ల కేటాయింపుపై అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశం ఉందని సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. అయితే తుది అభ్యర్థుల ఎంపిక అనంతరం కూటమి అభ్యర్థుల విజయానికి అన్ని పార్టీల శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని నాయకులు భావిస్తున్నారు.

సీట్ల సర్దుబాటు కారణంగా పార్టీ శ్రేణుల మధ్య విభేదాలు ఏర్పడకుండా చూడటం, ఎన్నికల ప్రచారంలో సమన్వయంతో ముందుకు సాగడం కీలకమని పేర్కొన్నారు.

భీమిలి నియోజకవర్గంపై ప్రత్యేక గురి

భీమిలి నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ 12 వార్డులతో పాటు ఆనందపురం, పద్మనాభం, భీమిలి గ్రామీణ మండలాల్లోని మూడు జెడ్పీటీసీ, 44 ఎంపీటీసీ స్థానాలపై కూటమి నాయకులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా స్థానాల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నారు. మొత్తంగా స్థానిక సంస్థల ఎన్నికలను కూటమి ఐక్యతకు పరీక్షగా భావిస్తున్న నాయకులు, సీట్ల సర్దుబాటు నుంచి ప్రచారం వరకు సమష్టి కార్యాచరణతో ముందుకు సాగేందుకు సిద్ధమవుతున్నారు.

ఎన్నికల వేళ అక్రమ మద్యం పట్టివేత.. 18 బాటిళ్లు స్వాధీనం

విశాఖపట్నం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29:
జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను అరికట్టేందుకు పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా వన్టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెయిన్ దొరపేటలో అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఒక వ్యక్తిని గుర్తించి, అతని వద్ద నుంచి 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వన్టౌన్ సీఐ వరప్రసాద్ తన సిబ్బందితో కలిసి చేపట్టిన తనిఖీల్లో ఈ మద్యం పట్టుబడింది. స్వాధీనం చేసుకున్న మద్యానికి సంబంధించి సదరు వ్యక్తిపై ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జీవీఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం లేదా ఇతర వస్తువులను పంపిణీ చేయడం వంటి అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని పోలీసులు హెచ్చరించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలకు తావులేకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినట్లయితే అధికారులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

జీవీఎంసీ ఎన్నికల వేళ గాజువాకలో విస్తృత తనిఖీలు

గాజువాక సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29:
జీవీఎంసీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు సీఐ వాసు నాయుడు ఆధ్వర్యంలో ఎస్సైలు రామకృష్ణ, జగదీష్, కృష్ణబాబు, పోలీసు సిబ్బంది ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అక్రమంగా నగదు, మద్యం, ఇతర నిషేధిత వస్తువుల రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేస్తూ వాహన పత్రాలను పరిశీలిస్తున్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, అక్రమ రవాణా సమాచారాన్ని వెంటనే తెలియజేయాలని కోరారు.

నర్సీపట్నం పురపాలక ఎన్నికలకు సన్నాహాలు వేగవంతం చేయాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ విజయకృష్ణ ఆదేశం

అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29:
నర్సీపట్నం పురపాలక ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయకృష్ణ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల కేటాయింపు, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అన్ని వార్డుల్లో సవరించిన తుది ఓటర్ల జాబితాలను అందుబాటులో ఉంచాలని, నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఆర్డీఓ, తహశీల్దార్తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి సాయంత్రం 5 గంటలకు మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగింపు

నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి

విజయనగరం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29:
మున్సిపల్ ఎన్నికల ప్రచార గడువు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ముగియనుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. ప్రచార గడువు ముగిసిన అనంతరం రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత మైకులు, బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు వంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

తుపాను గాయాల నుంచి విశాఖకు ఉపశమనం

1,192 చెట్లు నేలకూలాగా.. 1,057 చెట్ల తొలగింపు పూర్తి

45 జేసీబీలతో రేయింబవళ్లు పనులు.. శుక్రవారంలోగా రహదారులపై చెట్ల తొలగింపు లక్ష్యం

నగరంలో 70 శాతం తాగునీటి సరఫరా పునరుద్ధరణ.. నాలుగు పునరావాస కేంద్రాల్లో 94 మందికి ఆశ్రయం

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29:

ఆర్నాబ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న విశాఖ నగరాన్ని తిరిగి సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు జీవీఎంసీ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపడుతోంది. నేలకొరిగిన చెట్ల తొలగింపు, రహదారులపై పేరుకుపోయిన వ్యర్థాల శుభ్రత, గుంతల మరమ్మతులు, తాగునీటి సరఫరా పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించింది. శుక్రవారం నాటికి రహదారులపై కూలిన చెట్ల తొలగింపు పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ వెల్లడించారు. గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి సహాయక, పునరుద్ధరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈస్ట్ జోన్లో దత్ ఐలాండ్ నుంచి త్రీటౌన్ పోలీస్ స్టేషన్కు వెళ్లే రహదారితో పాటు బీచ్ రోడ్డులో పనుల పురోగతిని సమీక్షించారు. చెట్లను తొలగించిన తర్వాత రహదారులపై మిగిలే కొమ్మలు, ఆకులు, ఇతర వ్యర్థాలను పూర్తిగా శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. తుపానుతో దెబ్బతిన్న రహదారుల్లో గుంతలను గుర్తించి వెంటనే ప్యాచ్వర్క్ చేపట్టాలని సూచించారు.

1,192 చెట్లు నేలకూలాయి.. 902 చెట్ల తరలింపు పూర్తి

జీవీఎంసీ పరిధిలోని పది జోన్లలో తుపాను ప్రభావంతో మొత్తం 1,192 చెట్లు నేలకొరిగినట్లు గురువారం సాయంత్రం 6 గంటల వరకు అందిన నివేదిక వెల్లడించింది. వీటిలో 1,057 చెట్లను కట్ చేసి కొమ్మలను తొలగించగా, మరో 135 చెట్ల వద్ద ఈ పనులు కొనసాగాల్సి ఉంది. ఇప్పటివరకు 902 చెట్లను పూర్తిగా తరలించగా, మరో 290 చెట్లను తరలించాల్సి ఉంది. ఈ పనులను వేగవంతం చేసేందుకు 45 జేసీబీలతో పాటు టిప్పర్లు, అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని రంగంలోకి దించారు. రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తూ రహదారులపై అడ్డంకులను తొలగిస్తున్నారు. చెట్ల తొలగింపు పూర్తయిన ప్రాంతాల్లో వ్యర్థాలను కూడా తరలించి పరిశుభ్రతను మెరుగుపరచాలని కమిషనర్ ఆదేశించారు.

313 రహదారుల్లో రాకపోకలకు అడ్డంకుల తొలగింపు

నేలకూలిన చెట్ల కారణంగా నగరంలోని 313 రహదారుల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు అధికారులు గుర్తించారు. ఆయా రహదారుల్లో అడ్డంకులను తొలగించి రాకపోకలను పునరుద్ధరించినట్లు కమిషనర్ తెలిపారు. మిగిలిన చెట్లను తరలించే సమయంలో వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

శుక్రవారంలోగా పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా

తుపాను కారణంగా కొన్ని ప్రాంతాల్లో నిలిచిపోయిన తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు జీవీఎంసీ చర్యలు చేపట్టింది. గురువారం నాటికి నగరంలో సుమారు 70 శాతం సరఫరాను పునరుద్ధరించినట్లు కమిషనర్ తెలిపారు. మిగిలిన ప్రాంతాలకు సైతం శుక్రవారం నాటికి పూర్తిస్థాయిలో నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నీటి సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

గుఱ్ఱంకొండలో ఊపందుకొన్న టిడిపి ప్రచారం

గుర్రంకొండ అక్టోబర్ 29 సిటిజన్ టైమ్స్

అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం గుర్రంకొండ మండలంలో టిడిపి ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ఇప్పటికే 8ఎంపిటిసి స్థానాలు టిడిపి కి ఏకగ్రీవం కాగా మిగిలిన 4స్థానాలకు ఎన్నికలు జరుగనున్నవి. అందులో గుర్రంకొండ టౌన్ లో 2 ఎంపిటిసి స్థానాలున్నాయి. దానితో పాటు గుర్రంకొండ జెడ్పిటిసి స్తానానికి పోటీ ఉంది. ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఎలాగైనా టిడిపి విజయం సాధించాలని పట్టుదలతో మండల టిడిపి అధ్యక్షుడు నాయని జగదీష్ కుమార్ జెడ్పిటిసి అభ్యర్థి ఎజాజ్ అహమ్మద్ గుర్రంకొండ ఎంపిటిసి 1అభ్యర్థి సయ్యద్ అయిషా ఇక్బల్, 2వ ఎంపిటిసి అభ్యర్థి వి. వరలక్ష్మి ల విజయం కోసం కూటమి నాయకులతో కలిసి అందరు కలిసి ప్రచారం కొనసాగించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు వివరిస్తూ గుఱ్ఱంకొండలో ఇంకా అభివృద్ధి జరగాలంటే సైకిల్ గుర్తుకు ఓటు వేసి టిడిపి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. తప్పకుండ ప్రజల అండదండలతో విజయం సాధిస్తామని అభ్యర్థులు కూటమి నాయకులు తెలిపారు.

తుఫాన్ దెబ్బకు నేలకొరిగిన అరటి తోటలు..

పంట నష్టాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావులి

కొమరాజులంక, పొడగట్లపల్లిలో దెబ్బతిన్న అరటి తోటల పరిశీలన

రావులపాలెం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29:

తుఫాన్ ప్రభావంతో రావులపాలెం మండలంలోని కొమరాజులంక, పొడగట్లపల్లి గ్రామాల్లో నేలకొరిగిన అరటి తోటలను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గారు పరిశీలించారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధిత రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అరటి తోటలు నేలకొరగడంతో రైతులకు జరిగిన నష్టాన్ని, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టానికి సంబంధించిన వివరాలను సేకరించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన అంచనా వేయాల్సిన అవసరాన్ని గుర్తించారు.

ప్రచారానికి తెర.. ఇక ఎన్నికల నిబంధనల అమలుపై నిఘా!

నేటి సాయంత్రం 5 గంటలతో జీవీఎంసీ ఎన్నికల ప్రచార గడువు ముగింపు

నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు -కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ స్పష్టీకరణ

విశాఖపట్నం, అక్టోబర్ 29 సిటిజన్ టైమ్స్

జీవీఎంసీ ఎన్నికల ప్రచారానికి గడువు ముగియనుండటంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై అధికారులు దృష్టి సారించారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలతో ప్రచార కార్యక్రమాలు నిలిచిపోనున్న నేపథ్యంలో, ఆ తర్వాత ఎలాంటి ప్రచార కార్యకలాపాలు నిర్వహించకూడదని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు స్పష్టం చేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం పోలింగ్కు 48 గంటల ముందు ప్రచారాన్ని ముగించాల్సి ఉంటుందని తెలిపారు. గడువు ముగిసిన తర్వాత మైకుల వినియోగం, బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు వంటి ప్రచార కార్యక్రమాలకు అనుమతి ఉండదని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ప్రచారం కొనసాగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రశాంత పోలింగ్కు అధికారుల ఏర్పాట్లు

ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల నిబంధనల అమలులో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లు, భయాందోళనలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారం ముగిసిన అనంతరం నిబంధనలను పాటిస్తూ పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

తుఫాన్ ముంపు పొలాలను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్

కాలువ లీకేజీని వెంటనే అరికట్టాలి.. పంట పొలాల్లో నీరు తొలగించేందుకు చర్యలు చేపట్టాలి

అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29:

అర్నబ్ తుఫాన్ ప్రభావంతో నీట మునిగిన వరి పొలాలను అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ గురువారం యలమంచిలి మండలంలో పరిశీలించారు. పంటలకు మరింత నష్టం వాటిల్లకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలవరం ఎడమ కాలువకు సంబంధించి కొక్కిరాపల్లి--పేకిలాపాలెం వద్ద ఏర్పడిన లీకేజీని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. లీకేజీని పూర్తిస్థాయిలో అరికట్టాలని పోలవరం, నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తురంగలపాలెం, కొక్కిరాపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించి, రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం రామునాయుడుపాలెం గ్రామంలో మురుగునీరు, వర్షపు నీరు బయటకు వెళ్లే కాలువను పరిశీలించారు. నీటిపారుదల శాఖ డీఈఈ ప్రశాంతి, ఏఈ ప్రేమ్కుమార్లకు శుక్రవారం నాటికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పొలాల్లో నిల్వ ఉన్న నీటిని పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరి పంటలు ముంపునకు గురికాకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. తుఫాన్ ప్రభావంతో రైతులకు పంట నష్టం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో పోలవరం, ఆయకట్టు నీటిపారుదల శాఖ అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారి ఎం. ఆశాదేవి, ఇరిగేషన్ ఎస్ఈ, వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్లో తుపాను నష్టాల పరిశీలన..

మత్స్యకారులకు ఐజీపీ భద్రతా సూచనలు

విశాఖపట్నం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29

తుపాను ప్రభావంతో విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్లో దెబ్బతిన్న చేపల వేట పడవలను ఆంధ్రప్రదేశ్ కోస్టల్ సెక్యూరిటీ ఐజీపీ గోపీనాథ్ జెట్టి గురువారం పరిశీలించారు. అక్టోబర్ 27, 28 తేదీల మధ్య రాత్రి సైక్లోన్ అర్ణబ్ ప్రభావంతో వీచిన బలమైన గాలుల కారణంగా జీరో జెట్టీ వద్ద ఆరు చేపల వేట పడవలు దెబ్బతినడం లేదా నీటిలో మునిగిపోవడంతో ఆయన సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడిన ఐజీపీ తుపాను హెచ్చరికలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో చేపల వేటకు సముద్రంలోకి వెళ్లకూడదని, పడవలు, వాటికి సంబంధించిన పరికరాలను సురక్షితంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు వాతావరణ హెచ్చరికలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సూచించిన భద్రతా చర్యలను తప్పనిసరిగా అనుసరించాలని మత్స్యకారులకు సూచించారు. ఈ పర్యటనలో కోస్టల్ సెక్యూరిటీ అదనపు ఎస్పీ కె.వి. రమణ, విశాఖపట్నం కోస్టల్ సెక్యూరిటీ డీఎస్పీ ఎస్. కిరణ్ కుమార్, సీఐ ఎస్. రమేష్, మత్స్యశాఖ సిబ్బంది, మత్స్యకార సంఘాల నాయకులు, నష్టపోయిన పడవల యజమానులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలు, హోటళ్లలో అధికారుల తనిఖీలు

ఆహార నాణ్యత, తాగునీటి భద్రతపై ప్రత్యేక దృష్టి

శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29:

తుఫాను సహాయక చర్యల్లో భాగంగా శ్రీకాకుళం నగరంలోని పలు పునరావాస కేంద్రాలు, హోటళ్లలో ఆహార భద్రతా అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బాధితులకు అందుతున్న ఆహారం, తాగునీటి నాణ్యతను పరిశీలించి, ప్రజారోగ్య పరిరక్షణకు పలు సూచనలు చేశారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ సీహెచ్. లక్ష్మీనారాయణ, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కె. లక్ష్మి తనిఖీల్లో పాల్గొన్నారు. పునరావాస కేంద్రాల్లో ఆహార తయారీ, పంపిణీ విధానాలను పరిశీలించడంతో పాటు తాగునీటి నాణ్యత, పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. తుఫాను ప్రభావిత ప్రజలకు సురక్షితమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాల నిల్వ, తయారీ సమయంలో పరిశుభ్రతా ప్రమాణాలు పాటించాలని హోటళ్ల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఇదే సమయంలో ఆహార వ్యాపారులకు ఆన్లైన్ ద్వారా లైసెన్సుల నమోదు ప్రక్రియపై ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు ఆహార భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు.

దేవవరం, గొడ్డిచర్లలో హోంమంత్రి అనిత ప్రచారం

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: అనిత

నక్కపల్లి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29:

పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలం దేవవరం, గొడ్డిచర్ల గ్రామాల్లో గురువారం హోంమంత్రి వంగలపూడి అనిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత దేవవరం గ్రామంలోని వినాయక, ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించి, అనంతరం ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థులకు మద్దతు కోరారు. దేవవరంలో రెండున్నరేళ్లలో రూ.11 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. గొడ్డిచర్లలో మాట్లాడుతూ గోదావరి జలాలతో రైతులకు సాగునీటి ప్రయోజనాలు కలుగుతాయని, నక్కపల్లి ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. మహిళలకు ఉపాధి కల్పించేందుకు టాయ్ పార్క్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజాసేవ, గ్రామాల అభివృద్ధికి కృషి చేసే నాయకులను ఎన్నుకోవాలని, జడ్పీటీసీ అభ్యర్థి రమేష్తో పాటు కూటమి అభ్యర్థులను గెలిపించాలని హోంమంత్రి అనిత ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల వేళ పటిష్ట భద్రతా చర్యలు..

340 లైసెన్స్ తుపాకులు స్వాధీనం

విజయనగరం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29:

జిల్లాలో మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ ఐపీఎస్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఏడు ప్రాంతాల్లో చెక్పోస్టులు ఏర్పాటు చేసి, నిరంతరం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. బ్యాంకు భద్రతా విధుల్లో ఉన్న 67 తుపాకులు మినహా, మిగిలిన 340 లైసెన్స్ తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు భద్రత కల్పించడంతో పాటు, అల్లర్లకు పాల్పడే అవకాశం ఉన్న 20 వేల మందికి పైగా వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేశామన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలను అడ్డుకునేందుకు లాడ్జీలు, వాహనాలు, అనుమానాస్పద నగదు లావాదేవీలపై నిఘా పెట్టినట్లు తెలిపారు. హైపర్ సెన్సిటివ్ గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్లు నిర్వహిస్తూ, పోలీసు గస్తీని పెంచామని పేర్కొన్నారు. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఎంపీటీసీ అభ్యర్థులకు ఎన్నికల అవగాహన సదస్సు

ఎన్నికల ఖర్చులు, బ్యాలెట్ పేపర్, ప్రచార జాగ్రత్తలపై వివరణ

అమలాపురం - సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29

మండలంలో ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల నిబంధనలు, ఖర్చుల వివరాల సమర్పణ, మోడల్ బ్యాలెట్ పేపర్, ప్రచార సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

కల్పించేందుకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సదస్సు నిర్వహించనున్నారు. అమలాపురం ఎంపీడీవో కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి ఛాంబర్లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మండలం-4 రిటర్నింగ్ అధికారి అన్యం రాంబాబు తెలిపారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన నియమ నిబంధనలు, అభ్యర్థులు నిర్వహించాల్సిన ఎన్నికల ఖర్చుల వివరాలు, వాటిని ఏ సమయంలో సమర్పించాలి, మోడల్ బ్యాలెట్ పేపర్కు సంబంధించిన అంశాలతో పాటు ప్రచార సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలను ఈ సదస్సులో వివరించనున్నారు.

చేసిన అభివృద్ధే మా నమ్మకం..

ప్రజల ఆశీస్సులే మా బలం

ప్రజా తీర్పు కూటమికి అనుకూలం..

విజయమే మా లక్ష్యం

రామచంద్రపురంలో ఎన్నికల ప్రచార జోరు పెంచిన మంత్రి వాసంశెట్టి సుభాష్

చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావుతో కలిసి 7, 8వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం

రామచంద్రపురం, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29:

మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రచారాన్ని ఉధృతం చేశారు. పట్టణంలోని 7వ వార్డులో గురువారం మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి మేడిశెట్టి శేషారావు, 7వ వార్డు కూటమి అభ్యర్థి రాయుడు మణికంఠ (బీజేపీ), ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, నియోజకవర్గ పరిశీలకురాలు మజ్జి పద్మావతి, చిక్కాల దొరబాబు, కర్రి చిట్టిబాబు లతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావుతో పాటు 32 వార్డుల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈసారి మున్సిపల్ చైర్మన్ ను ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎన్నుకునే నేపథ్యంలో ఓటర్లు ఓటింగ్ విధానంపై అవగాహన కలిగి ఉండాలని మంత్రి సూచించారు. చైర్మన్ అభ్యర్థికి, వార్డు కౌన్సిలర్ అభ్యర్థికి వేర్వేరుగా ఓటు వేసి కూటమికి మద్దతు తెలపాలని కోరారు. చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావు విద్యావంతుడని, 30 ఏళ్ల రాజకీయ అనుభవంతో ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన నాయకుడని మంత్రి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే ఎన్నికల్లో తమకు ప్రజల మద్దతు తెస్తాయని ధీమా వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం ఎదుర్కొన్న నష్టాలను, ప్రస్తుత ప్రభుత్వ అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు బీజేపీ అభ్యర్థి రాయుడు మణికంఠ, కర్రీ చిట్టిబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవీఎంసీ కాంట్రాక్టులపై అవినీతి ఆరోపణలు

చిన్న కాంట్రాక్టర్లకు అన్యాయం జరుగుతోంది: ప్రియాంక దండి

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29:

జీవీఎంసీలో కూటమి ప్రభుత్వం పెద్ద కాంట్రాక్టర్లకు ప్రాధాన్యం ఇస్తూ చిన్న కాంట్రాక్టర్లకు అన్యాయం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి ప్రియాంక దండి ఆరోపించారు. జీవీఎంసీ వద్ద మీడియాతో మాట్లాడిన ఆమె, సుమారు రూ.400 కోట్ల విలువైన బీటీ, సీసీ రోడ్ల పనులను ఎన్సీసీ లిమిటెడ్కు అప్పగించడం వల్ల స్థానిక చిన్న కాంట్రాక్టర్లు నష్టపోతున్నారని విమర్శించారు.

రూ.400 కోట్ల కాంట్రాక్టుపై ప్రశ్నలు

ఎన్సీసీ లిమిటెడ్కు కేటాయించిన కాంట్రాక్టుపై గత నెలలోనే ప్రశ్నించేందుకు వచ్చామని, అయితే అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నారని తెలిపారని ప్రియాంక పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియలో అనుసరించిన విధానంపై సందేహాలు ఉన్నాయని, నాగార్జున కన్స్ట్రక్షన్ కంపెనీకి ప్రయోజనం చేకూర్చేలా నిర్ణయాలు తీసుకున్నారా? సంస్థకు కాంట్రాక్టు కేటాయింపు వెనుక ఉన్న లావాదేవీలేమిటి? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కాంట్రాక్టును రద్దు చేసి జీవీఎంసీలోని స్థానిక కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాలని కోరారు. కార్పొరేట్ సంస్థలకు కాంట్రాక్టులు కేటాయిస్తూ ముడుపులు తీసుకుంటున్నారని, ఆ సొమ్మును ఎన్నికల్లో ఓట్ల కొనుగోలుకు వినియోగిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

చిన్న కాంట్రాక్టర్లకు బిల్లుల కష్టాలు

జీవీఎంసీలో చిన్న కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసినప్పటికీ బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ప్రియాంక అన్నారు. కొందరు ధర్నాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని, మరోవైపు పెద్ద



కాంట్రాక్టర్లకు వేగంగా బిల్లులు చెల్లిస్తున్నారని విమర్శించారు. జీవీఎంసీలో వందల కోట్ల రూపాయల విలువైన బిల్లుల వ్యవహారంపై ఒక ఆర్టీఐ కార్యకర్త తన దృష్టికి సమాచారం తీసుకొచ్చారని తెలిపారు. ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తున్న నిధుల వినియోగంపై పారదర్శకత ఉండాలని, 15వ ఆర్థిక సంఘం నిధులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్రం నుంచి జీవీఎంసీకి రావాల్సిన సుమారు రూ.1,500 కోట్ల నిధులను రాబట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

కూటమి పార్టీల్లో అసంతృప్తి ఉందని వ్యాఖ్య

టీడీపీ పాలనపై కూటమి భాగస్వామ్య పార్టీలైన జనసేన, బీజేపీల కింది స్థాయి కార్యకర్తల్లో అసంతృప్తి ఉందని ప్రియాంక అన్నారు. ఈ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో జనసేన, బీజేపీకి చెందిన నాయకులు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని తెలిపారు. జీవీఎంసీలో జరుగుతున్నాయని తాము ఆరోపిస్తున్న అవినీతి వ్యవహారాలపై కౌన్సిల్లో ప్రశ్నించేందుకు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం అభ్యర్థులను గెలిపించి పంపించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విశాఖ ప్రజలు తమ ఓటు ద్వారా పాలనపై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు.

నగరాభివృద్ధి, ప్రజా సమస్యలపై ప్రస్తావన

నగరంలో పారదర్శక పాలన, మెరుగైన పౌర సేవలు, వేగవంతమైన సమస్యల పరిష్కారం అవసరమని ప్రియాంక అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలని, రిలయన్స్ డేటా సెంటర్ ప్రాజెక్టు విషయంలోనూ ప్రజల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

మేయర్ అభ్యర్థి ప్రకటనపై కాంగ్రెస్ నేత అసంతృప్తి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇలపండ చంద్రశేఖర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారిక మేయర్ అభ్యర్థిగా పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ప్రియాంక దండిని ప్రకటించినప్పటికీ, స్థానిక పార్టీ నాయకులు మరో అభ్యర్థికి బీ-ఫారం ఇవ్వడం సరికాదని అన్నారు. ప్రియాంక పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉంటే ప్రజా సమస్యలపై గళం వినిపించి కూటమికి గట్టి పోటీ ఇచ్చేవారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జగన్ మురారి, పొట్నూరు నాగేంద్ర, వేమూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డాబా గార్డెన్స్లో దొంగల బీభత్సం..

రూ.50 లక్షల మొబైల్ ఫోన్లు మాయం

35 ఐఫోన్లు సహా విలువైన మొబైళ్లు అపహరణ..

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న టూ టౌన్ పోలీసులు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29:

విశాఖపట్నం నగరంలోని డాబా గార్డెన్స్లో ఉన్న సెల్ పాయింట్ మొబైల్ షాపులో భారీ చోరీ జరిగింది. షాపు వెనుక భాగంలోని షట్టర్ను కత్తిరించి లోపలికి ప్రవేశించిన దుండగులు సుమారు రూ.50 లక్షల విలువైన మొబైల్ ఫోన్లను అపహరించారు. వీటిలో 35 ఐఫోన్లతో పాటు ఇతర ఖరీదైన మొబైళ్లు ఉన్నట్లు సమాచారం. నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో దుండగులు ఈ చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. షాపు వెనుక భాగంలో ఉన్న షట్టర్ను కత్తిరించి లోపలికి ప్రవేశించిన నిందితులు, అక్కడ ఉన్న విలువైన సెల్ఫోన్లను తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఉదయం షాపు తెరిచిన అనంతరం సిబ్బంది చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. వెంటనే షాపు మేనేజర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో సుమారు రూ.50 లక్షల విలువైన మొబైల్ ఫోన్లు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న టూ టౌన్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. చోరీ జరిగిన తీరును పరిశీలిస్తూ, నిందితులను గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నారు. షాపులోని సీసీ కెమెరాల దృశ్యాలు, ఇతర ఆధారాల ద్వారా నిందితుల ఆచూకీ తెలుసుకునే దిశగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. భారీ మొత్తంలో విలువైన మొబైల్ ఫోన్లు చోరీకి గురికావడంతో షాపు యాజమాన్యం ఆందోళనకు గురైంది. నిందితులను త్వరగా గుర్తించి, అపహరణకు గురైన ఫోన్లను స్వాధీనం చేసుకోవాలని యజమానులు కోరుతున్నారు.

అమలాపురంలో కూటమి అభ్యర్థుల ఇంటింటి ప్రచారం

1, 11వ వార్డుల్లో ప్రజలను కలిసిన చైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్

అమలాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29:

అమలాపురం మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఇందులో భాగంగా 1, 11వ వార్డుల్లో కూటమి అభ్యర్థులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్తో పాటు 1వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి దేవరపల్లి శాంతికుమార్, 11వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి నల్లా ఫణి మాధురి ప్రజలను నేరుగా కలిసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, ఎంపీ గంటి హరీష్ మాధుర్, అల్లాడ స్వామినాయుడు, మెట్ల రమణబాబు, చిక్కాల సతీష్, గంధం పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొన్నారు. వార్డుల పరిధిలో ఇంటింటికీ వెళ్లి అభ్యర్థులకు మద్దతు కోరారు.

అర్నబ్ తుఫానుతో రాష్ట్రానికి రూ.4,600 కోట్ల నష్టం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు -కొబ్బరి, ఆయిల్ పామ్ చెట్టుకు రూ.1,500 పరిహారం

బాధితులకు బియ్యం, నిత్యావసరాలు, నగదు సాయం

కోనసీమలో 8 వేల విద్యుత్ స్తంభాలు నేలమట్టం -రేపు నష్టాల పరిశీలనకు కేంద్ర బృందాలు

కాట్రేనికోన సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29 :

అర్నబ్ తుఫాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక అంచనా ప్రకారం రూ.4,600 కోట్ల నష్టం వాటిల్లిందని సీఎం నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. పూర్తిస్థాయి అంచనా తర్వాత ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం గచ్చకాయలపొర గ్రామంలో గురువారం తుఫాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన సీఎం అనంతరం మీడియాతో మాట్లాడారు. దెబ్బతిన్న కొబ్బరి, ఆయిల్ పామ్ చెట్లకు ఒక్కో చెట్టుకు రూ.1,500 పరిహారం. వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాన్ని అంచనా వేసి అర్హులకు పరిహారం పంటల బీమా ద్వారా కూడా పరిహారం,పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు వెళ్లే అర్హులైన కుటుంబాలకు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకుల ప్యాకెట్, నగదు సాయం అందజేశారు.

కోనసీమలో 8 వేల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. పునరుద్ధరణకు తెలంగాణ నుంచి 1,000 మంది సిబ్బందిని కోరామని, అవసరమైతే కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా తెప్పిస్తామన్నారు. టెలికాం, రహదారుల పునరుద్ధరణ జరుగుతోందని తెలిపారు.నష్టాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లామని, ప్రాథమిక నివేదిక

పంపామని, శుక్రవారం కేంద్ర బృందాలు రాష్ట్రానికి వచ్చి పరిశీలిస్తాయని తెలిపారు. ముందస్తు హెచ్చరికలు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ఆర్టిజిఎస్ ద్వారా నిరంతర సమీక్షల వల్ల ప్రాణ నష్టాన్ని తగ్గించగలిగామని, అయినా ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా బాధితులను ఆదుకోవడంలో వెనుకడుగు వేయబోమని, రైతులు, మత్స్యకారులు, పేదలకు అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు.

సీఎం చంద్రబాబు పర్యటనలో పలువురు అగ్రనేతలు

ముమ్మిడివరం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29:

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన పర్యటనలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి బాధిత రైతులు, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వేట్లపాలెం గ్రామంలో తుఫాన్ బాధిత రైతులతో ముఖాముఖి నిర్వహించిన చంద్రబాబు, నీట మునిగిన పంట పొలాలు, దెబ్బతిన్న కొబ్బరి చెట్లను పరిశీలించారు. పంట నష్టం, దిగుబడి తగ్గే ప్రమాదం, కొబ్బరి తోటలకు జరిగిన నష్టంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. పంటల బీమా, ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం గచకాయలపోర సైక్లోన్ షెల్టర్ వద్ద ప్రజలతో సమావేశమై వారికి అందుతున్న సహాయక చర్యలను సమీక్షించారు. తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో మంత్రి అచ్చెన్నాయుడు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి, అమలాపురం పార్లమెంటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అర్నబ్ తుఫాన్ తో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్

ఆలమూరు సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29

అర్నబ్ తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతుల పరిస్థితిని తెలుసుకునేందుకు కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ఆలమూరు మండలంలోని చొప్పెల్ల, నర్సిపూడి, నవాబుపేట, కలవచర్ల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన వరి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధిత రైతులతో నేరుగా మాట్లాడి పంట నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసిన రైతులు తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఎంతో ఊరటనిచ్చే అంశమని పేర్కొన్నారు.

ప్రతి పొలాన్ని పరిశీలించండి.. రైతుకు భరోసా ఇవ్వండి!

తుఫాను నష్టాల అంచనాపై మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

అమరావతి, అక్టోబర్ 29 (సిటిజన్ టైమ్స్):
ఆర్నాబ్ తుఫాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య రంగాలకు జరిగిన నష్టాలను సమగ్రంగా అంచనా వేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా ప్రతి పొలాన్ని పరిశీలించి నష్టాలను నమోదు చేయడంతో పాటు, మరింత పంట నష్టం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. తుఫాను ప్రభావంతో వ్యవసాయ, అనుబంధ రంగాలకు జరిగిన నష్టాలపై గురువారం ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నష్టాల వివరాలను అధికారులు ఆయనకు వివరించారు.

3.51 లక్షల హెక్టార్లలో పంటలు నీటమునక
రాష్ట్రంలోని 16 జిల్లాల పరిధిలో 291 మండలాలు, 7,613 గ్రామాల్లో 5,42,003 మంది రైతులకు చెందిన 3,51,962.60 హెక్టార్లలో పంటలు నీటమునిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఇందులో వరి పంట 3,45,582.60 హెక్టార్లలో ప్రభావితమైంది. అలాగే 15 జిల్లాల్లోని 215 మండలాలు, 1,218 గ్రామాల్లో 77,431 మంది రైతులకు చెందిన 22,457.75 హెక్టార్ల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి ఇన్పుట్ సబ్సిడీ ప్రాథమిక అంచనా రూ.99.23 కోట్లుగా నమోదైంది. పశు సంవర్ధక రంగంలో 46 ఆవులు, గేదెలు, 63 గొర్రెలు, మేకలు, 32 దూడలు, 7,656 కోళ్లు మృతి చెందాయి. మరో 140 పశువుల షెడ్లు దెబ్బతిన్నాయి. ఈ రంగానికి సంబంధించి ప్రాథమిక నష్టం రూ.50.38 లక్షలుగా అంచనా వేశారు. మత్స్య రంగంలో తొమ్మిది జిల్లాల పరిధిలో 1,884 పడవలు, 3,224 వలలు దెబ్బతిన్నాయి. 11,483.39 ఎకరాల ఆక్వా సాగు ప్రభావితమవగా, 61 చెరువులకు నష్టం వాటిల్లింది. అన్ని రంగాలకు కలిపి మొత్తం ప్రాథమిక నష్టం రూ.176.82 కోట్లుగా అంచనా వేశారు.

నష్టాల నమోదులో తప్పులకు తావుండకూడదు..: అక్టోబర్ 30

నుంచి వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖల సిబ్బంది పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయిలో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతి రైతును సంప్రదించి, ప్రతి పొలాన్ని పరిశీలించి పంట విస్తీర్ణం, నష్టం తీవ్రతను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఏ ఒక్క రైతు వివరాలు మిస్సవకుండా, నష్టాన్ని పాక్షికంగా నమోదు చేసే పొరపాట్లకు తావులేకుండా సమగ్ర సర్వే చేపట్టాలని స్పష్టం చేశారు. నష్టాల అంచనాకే పరిమితం కాకుండా పంటలను కాపాడేందుకు సమాంతరంగా చర్యలు చేపట్టాలని సూచించారు. రాబోయే రెండు మూడు రోజులు అత్యంత కీలకమని పేర్కొంటూ, పొలాల్లో నిలిచిన నీటిని తొలగించడం, అవసరమైన మందులు, పోషకాలు అందించడం, శాస్త్రీయ పద్ధతుల్లో పంటలను పునరుద్ధరించడం ద్వారా సాధ్యమైనంత మేర నష్టాన్ని తగ్గించాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయికి వ్యవసాయ శాస్త్రవేత్తలు
నాలుగు వ్యవసాయ, అనుబంధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు తమ పరిధిలోని ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలకు ప్రభావిత ప్రాంతాలవారీగా బాధ్యతలు కేటాయించాలని మంత్రి సూచించారు. శాస్త్రవేత్తలు నేరుగా రైతులను కలిసి పంటల పరిస్థితిని పరిశీలించి, నష్టాన్ని తగ్గించేందుకు అవసరమైన శాస్త్రీయ సలహాలు, నివారణ చర్యలు సూచించాలన్నారు. ప్రతి ప్రొఫెసర్, శాస్త్రవేత్తకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, వారు సందర్శించిన గ్రామాలు, పరిశీలించిన పంటలు, కలిసిన రైతుల సంఖ్య, అందించిన సలహాలపై రోజువారీ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

స్వీయ నమోదు వివరాల ధ్రువీకరణ
ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన స్వీయ నమోదు యాప్లో రైతులు నమోదు చేసిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ధ్రువీకరించాలని మంత్రి ఆదేశించారు. వాస్తవ పంట విస్తీర్ణం, నష్టం తీవ్రత ఆధారంగా కచ్చితమైన నివేదికలు రూపొందించడంతో పాటు రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలని సూచించారు. నష్టాల నమోదు ప్రక్రియలో జాప్యం జరగకుండా నాలుగు శాఖల క్షేత్రస్థాయి సిబ్బంది సెలవులను రద్దు చేయాలని, అత్యవసర వైద్య కారణాల వంటి అనివార్య పరిస్థితుల్లో మాత్రమే మినహాయింపు ఇవ్వాలని తెలిపారు. సిబ్బంది కొరత ఉన్న ప్రాంతాలకు తుఫాను ప్రభావం లేని ప్రాంతాల నుంచి అదనపు సిబ్బందిని తక్షణమే నియమించాలని ఆదేశించారు.

రేపు జిల్లా కలెక్టర్లతో ప్రత్యేక సమీక్ష
నష్టాల అంచనాలో జాప్యం, సిబ్బంది కొరత, ఇతర సమస్యలు ఎదురవుతున్న జిల్లాలను గుర్తించి ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 30వ తేదీ సాయంత్రం సంబంధిత జిల్లా కలెక్టర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి రైతుకూ న్యాయం జరగాలని, ప్రతి పొలాన్ని పరిశీలించి సమగ్ర నష్టాల అంచనా వేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. పంటలను కాపాడేందుకు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని, అధికారులు, శాస్త్రవేత్తలు సమన్వయంతో పనిచేసి రైతులకు క్షేత్రస్థాయిలో భరోసా కల్పించాలని ఆదేశించారు.

మద్యం మత్తులో కలెక్టర్ కారును ఢీకొట్టిన లారీ డ్రైవర్కు 7 రోజుల జైలు

విజయనగరం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29:
మద్యం మత్తులో లారీ నడుపుతూ విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి వాహనాన్ని ఢీకొట్టిన డ్రైవర్కు న్యాయస్థానం ఏడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ గురువారం వెల్లడించారు. అక్టోబర్ 28న ఎన్నికల విధుల పర్యవేక్షణ కోసం బొబ్బిలికి వెళ్లి తిరిగి వస్తున్న కలెక్టర్ వాహనాన్ని బూసాయవలస కోల్డ్ స్టోరేజ్ సమీపంలో మహారాష్ట్రలోని నాగ్పూర్కు చెందిన లారీ డ్రైవర్ వివేక్ విజయ్ కరన్వర్ ఢీకొట్టాడు. మద్యం మత్తులో రాంగ్ రూట్లో లారీ నడుపుతూ ప్రమాదానికి కారణమైన డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించాడు. పోలీసులు లారీని వెంబడించి డ్రైవర్ను పట్టుకున్నారు. రామభద్రపురం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని సాలూరు జేఎఫ్సీఎం కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయమూర్తి జి. హర్షవర్ధన్ డ్రైవర్కు ఏడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్పీ తెలిపారు.

30 ఏళ్ల క్రితం ముమ్మిడివరం రోడ్లపై చంద్రబాబు హెలికాప్టర్

30 ఏళ్ల క్రితం హరికేన్ తుఫాన్ సందర్భంగా సీఎం చంద్రబాబు పర్యటనను గుర్తు చేసుకున్న స్థానిక రైతులు

ముమ్మిడివరం, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29
అర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేట్లపాలెం రైతులు 1996లో వచ్చిన హరికేన్ తుఫాన్ ఘటనను గుర్తు చేశారు. అప్పట్లో బాధితులను పరామర్శించేందుకు హెలికాప్టర్లో వచ్చి రోడ్డుపైనే దిగిన విషయాన్ని రైతులు ముఖ్యమంత్రి వద్ద ప్రస్తావించారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తమ ప్రాంత ప్రజలకు ముందుగా సీఎం చంద్రబాబే గుర్తుకొస్తారని పేర్కొన్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం నవంబర్ 6న వచ్చిన హరికేన్ తుఫాన్ కోనసీమ ప్రాంతాన్ని తీవ్రంగా దెబ్బతీసిందని నాటి సంఘటనలను సీఎంకు స్థానికులు గుర్తు చేశారు. సీఎం కోనసీమ పర్యటన సందర్భంగా 30 ఏళ్ల క్రితం వచ్చిన హరికేన్ బీభత్సాన్ని, నాడు సీఎం చంద్రబాబు స్పందించిన విధానం వారి మధ్య చర్చకు వచ్చింది. నాడు రాకపోకలు స్తంభించిన నేపథ్యంలో రోడ్లపై హెలికాప్టర్ను దించడం తాము ఇంకా మరవలేదని గుర్తు చేసుకున్నారు. హెలికాప్టర్ దించడం సాధ్యం కాదన్నా తమ కోసం వచ్చి యంత్రాంగాన్ని కదిలించిన విషయం ఇంకా తమ కళ్ల ముందు కదలాడుతోందని అన్నారు. అలాగే పరిస్థితులు చక్కబడేంత వరకు రాజమండ్రిలో వారం రోజుల పాటు సీఎం మకాం వేసిన విషయాన్ని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కార్యాలయాల్లో సమీక్షలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయికి వచ్చి పరిస్థితులను చక్కదిద్దే ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబే అని రైతులు చర్చించుకున్నారు. అప్పుడూ... ఇప్పుడూ చంద్రబాబు పనితీరు మారలేదంటూ నాటి నేటి పరిస్థితులను పోల్చుకున్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం -తల్లి, కూతురు దుర్మరణం

గురంకొండ అక్టోబర్ 29సిటిజన్ టైమ్స్ :
వైద్యం కోసం తల్లిని ఆసుపత్రికి తీసుకెళ్తున్న ఆ కుటుంబానికి మార్గ మధ్యంలోనే మృత్యువు ఎదురొచ్చింది. గుర్రంకొండ మండలం సమీపంలో కారును ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొన్న ఘటనలో తల్లి, కుమార్తె ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర సంఘటన బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది.పోలీసులు మరియు స్థానికులు తెలిపిన వివరాలను బట్టి కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం పొట్లదుర్తి గ్రామానికి చెందిన బాలయ్య భార్య సంజనమ్మ (68)కు ఇటీవల పక్షవాతం (పారాలిసిస్) వచ్చింది. ఆమెకు వైద్యం చేయించడం కోసం కుమార్తె అరుణమ్మ (53), కుమారుడు మహేంద్ర (28)తో కలిసి బుధవారం రాత్రి స్వగ్రామం నుంచి విరుపాచ్చి పురానికి కారులో బయలుదేరారు.కారు గుర్రంకొండ మండలం చిట్టబోయినపల్లి వద్దకు చేరుకోగానే.. బెంగళూరు నుండి రాజంపేట వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2:30 గంటల సమయంలో అతివేగంగా వచ్చి కారును బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జ కాగా సంజనమ్మ కారులోనే అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. కారులో ఉన్న అరుణమ్మ, మహేంద్ర మరియు కార్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు



సంఘటనా స్థలానికి చేరుకుని, క్షత గాత్రులను 108 అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అయితే, అరుణమ్మ పరిస్థితి అత్యంత విషమంగా మారడంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ (రిమ్స్) ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే కన్నుమూశారు. తీవ్ర గాయాలపాలైన మహేంద్ర, కార్ డ్రైవర్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ ప్రమాదంపై గుర్రంకొండ సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్సై) రవీంద్రబాబు మాట్లాడుతూ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. వైద్యం కోసం వెళ్తూ తల్లి, కూతురు ఇద్దరూ మరణించడంతో పొట్లదుర్తి గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

వరద ప్రవాహాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నీటి ప్రవాహాలు, చెరువులు, ఇతర జలాశయాల వద్దకు వెళ్లవద్దు

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

కాకినాడ సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29:
కాకినాడ జిల్లాలో తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు, వరద ప్రవాహాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ముఖ్యంగా అర్నబ్ తుఫాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలతో వాగులు, వంకల్లో ఆకస్మికంగా వరద ప్రవాహం పెరిగే ప్రమాదం ఉన్నందున ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజలు నీటి ప్రవాహాల పట్ల అప్రమత్తంగా ఉంటూ వంకలు, కాలువలు, చెరువులు, నదులు, ఇతర నీటి వనరుల వద్దకు వెళ్లరాదని, పిల్లలను నీటి ప్రవాహాలు, చెరువులు, కాలువలు, వరద ప్రభావిత ప్రాంతాల వద్దకు వెళ్లకుండా పెద్దలు

జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. పెద్దలు సైతం వరద నీటిలోకి దిగడం, ప్రవాహాలను దాటేందుకు ప్రయత్నించడం చేయకూడదని, వరద నీటితో నిండిన రహదారులు, కల్వర్టులు, లోతట్టు ప్రాంతాల గుండా ప్రయాణించవద్దని తెలిపారు. అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో సహాయక బృందాలకు సహకరించాలని కోరారు. తుఫాను, భారీ వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ జిల్లా యంత్రాంగం రక్షణ, సహాయక చర్యలు చేపడుతోందని, అవసరమైన ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు సహాయం అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ పిలుపు

అమలాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29:
రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అమలాపురం పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ మున్సిపల్ చైర్మన్, టీడీపీ నాయకుడు చిక్కాల గణేష్ కోరారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ చైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్తో పాటు అన్ని వార్డుల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తన హయాంలో పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని, భవిష్యత్తులోనూ రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కృషి జరగాలని అన్నారు. అమలాపురం అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని పట్టణ ఓటర్లకు పిలుపునిచ్చారు.

బహుదా నదిలో వరద ఉద్ధృతి.. ఇచ్ఛాపురం మండలంలో విద్యాసంస్థలకు రేపు సెలవు

అంగన్వాడీ కేంద్రాలు సహా అన్ని విద్యాసంస్థలకు వర్తింపు

శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29
బహుదా నదిలో వరద ఉద్ధృతి మూడో ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటడంతో ఇచ్ఛాపురం మండలంలోని అన్ని విద్యాసంస్థలకు శుక్రవారం సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ సెలవు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. సంబంధిత విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో స్థానిక పరిస్థితులను బట్టి, విద్యాశాఖ అధికారుల నివేదిక ఆధారంగా సంబంధిత అధికారులు సెలవులపై నిర్ణయం తీసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. వరద పరిస్థితుల నేపథ్యంలో విద్యార్థులు, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికార యంత్రాంగానికి సూచించారు.

మున్సిపల్ ఎన్నికల్లో కూటమి తరఫున కొండారెడ్డి ప్రచారం

కూటమి అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తాం

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29:
పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నాయకుడు, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే కుమారుడు ఎన్. కొండారెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. కూటమి చైర్మన్ అభ్యర్థి తుగట్ల గీతారెడ్డితో పాటు 20వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి తరఫున ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ.. పులివెందులలో గతంలో రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ ఆశించిన స్థాయిలో మున్సిపల్ అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపిస్తే పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని పేర్కొన్నారు. పులివెందుల మున్సిపాలిటీని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి భారీ మెజారిటీతో గెలిపించాలని కొండారెడ్డి విజ్ఞప్తి చేశారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29:
పులివెందుల తాలూకా వేంపల్లి మండలం కుప్పాలపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేంపల్లి మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలిపి, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలను అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలను కలిసి తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.

ముమ్మిడివరం నగర పంచాయతీ కూటమి అభ్యర్థుల ఇంటింటి ప్రచారం

ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29
నగర పంచాయతీ చైర్ పర్సన్ గా పోటీ చేస్తున్న గుబ్బల గంగా రత్న భవాని క్రాప చింతలపూడి 19వ వార్డు కౌన్సిలర్ గా తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి చింతలపూడి వెంకటేశ్వరరావు ఇంటింటి ప్రచార కార్యక్రమం చేపట్టారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు భారీగా పాల్గొన్నారు. క్రాప చింతలపూడి గ్రామంలో ప్రచారానికి ప్రజలు హారతులు పట్టి విశేష స్పందన తెలిపారు. కూటమికే ఓటు వేస్తామని హామీ ఇచ్చారు. అలాగే 16వ వార్డు టీడీపీ అభ్యర్థి జనపల్లి సత్యనారాయణ ప్రతి ఇంటికి వెళ్లి ఓటును అభ్యర్థించారు. తెలుగుదేశం సైకిల్ గుర్తుకు, జనసేన గ్లాస్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిద్దలూరుకు ఎన్నికల ద్వారా విషసంస్కృతి తేకండి

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల, ఒంగోలు ఎంపీ మాగుంట -ఫ్యాక్షన్ సంస్కృతి మనకు వద్దు

గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29

స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా గిద్దలూరు లో ఫ్యాక్షన్ సంస్కృతి తేవద్దని గిద్దలూరు ప్రజలకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి , ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి లు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు గిద్దలూరు విచ్చేసిన ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి పాత్రికేయుల తో మాట్లాడారు. గిద్దలూరు లో గత కొన్నేళ్ల క్రితం పడమటి ఫ్యాక్షన్ సంస్కృతి ఉండేదని దాని తరువాత అణచివేయటం జరిగిందని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి ఇక్కడ వ్యాపారం కోసం వచ్చిన వారు ఇక్కడ ఎన్నికల్లో పోటీచేసి మనపై పెత్తనం చేయాలనుకోటం సరి కాదన్నారు. మనపై వలసవచ్చిన వారి పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. స్థానికతను చూసి పట్టంకట్టాలన్నారు. అప్పుడే గిద్దలూరు అభివృద్ధి పథంలో నడిపించే వీలుంటుందన్నారు. గిద్దలూరు లోనే పుట్టి పెరిగి మం ప్రాంత సంస్కృతి తెలిసిన డాక్టర్ జె వి నారాయణ ను ఈ ఎన్నికల్లో గెలిపించుకోవాలన్నారు. దేనితో త్రిబుల్ ఇంజన్ సర్కార్ తో మన మున్సి పాలిటి మన నియోజకవర్గం అభివృద్ధి పాదంలో నడిపిద్దామని తెలిపారు. గత ఐదు ఏండ్లలో వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకుని అరాచక పాలన చేశారని , కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవస్థలను ప్రక్షాళన చేసి ఆర్ధిక పరిస్థితులు అదుపులోకి తెచ్చి సంక్షేమం , అభివృద్ధి ఏకకాలంలో ముందుకు తీసుకెళుతున్న కూటమి ని ఆదరించాల్సి పరిస్థితి ఏర్పడిందాన్నారు రాష్టంలో టిడిపి జెనసేన బిజెపి ఆధ్వర్యంలో రాష్టంలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు. స్థానికంగా మున్సిపల్ అభివృద్ధి కి స్థానికుడు డాక్టర్ జేవీ నారాయణ కు ఓటేసి గెలిపించుకోవాలని , అట్లే కూటమి టిడిపి, జెనసేన , బిజెపి కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించుకుందా మన్నారు , కూటమి తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. గిద్దలూరు మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే

గిద్దలూరు ప్రజలకు డాక్టర్ జె.వి నారాయణ హామీ

నన్ను ఆదరించి గెలిపించండి.. ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తా"

ప్రజలకు మరింత సేవ చేయాలనే ఆలోచనతోనే రాజకీయాల్లోకి వచ్చా -డాక్టర్ జేవీ నారాయణ

గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29

గిద్దలూరు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్డీఏ కూటమి చైర్మన్ అభ్యర్థి డాక్టర్ జాడీ వెంకటనారాయణ ప్రజలకు కీలక హామీ ఇచ్చారు. తాను మున్సిపల్ చైర్మన్గా గెలిస్తే చిన్నపిల్లలకు, పెద్దలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ జేవీ నారాయణ మాట్లాడుతూ.. వైద్య వృత్తిలో కొనసాగుతూ ఇప్పటికే ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నానని తెలిపారు. తన సేవలను మరింత విస్తృతం చేసి, ఎక్కువ మంది ప్రజలకు ఉపయోగపడాలనే ఆలోచనతోనే రాజకీయాల్లోకి వచ్చానని పేర్కొన్నారు. ప్రజలకు మరింత సేవ చేసుకునేందుకు ఓటర్లు తనను ఆదరించి, గెలిపించి అవకాశం కల్పించాలని కోరారు. ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజాప్రతినిధిగా అవకాశం లభిస్తే వైద్య సేవలను మరింత విస్తృతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్గా ఎన్నికైతే పిల్లలకు, పెద్దలకు ఉచిత వైద్య సేవలు అందిస్తానన్న ఆయన హామీ గిద్దలూరు ఎన్నికల ప్రచారంలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పట్టణంలో తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పారిశుధ్యం వంటి సమస్యలపై ఎన్నికల ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ఉచిత వైద్య సేవల హామీతో గిద్దలూరు మున్సిపల్ ఎన్నికల రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారుతున్నాయి.

స్కూటర్ ను ఢీ కొట్టిన మరో ద్విచక్ర వాహనం

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి నితీష్ రెడ్డి మృతి

తన స్కూటీపై కొమరోలు కు వచ్చి తిరిగి స్వగ్రామమైన నరసింహుని పల్లెకు వెళుతుండగా ప్రమాదం.

కొమరోలు, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29

స్కూటర్ ను ఎదురుగా అతివేగంతో వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో కొమరోలు మండలం నరసింహుని పల్లి గ్రామానికి చెందిన నెలటూరి నితీష్ రెడ్డి (21) బుధవారం మృతి చెందిన విషాద సంఘటన గోపానిపల్లె,- బాదినేని పల్లె గ్రామాల మధ్యగల రహదారిపై జరిగింది. కొమరోలు పోలీసులు తెలిపిన వివరాల మేరకు, నరసింహుని పల్లి గ్రామానికి చెందిన నెల్లటూరి అంకిరెడ్డి, అంగన్వాడీ కార్యకర్త వెంకట లక్ష్మి ల ఏకైక కుమారుడు నితీష్ రెడ్డి బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులను తల్లిదండ్రులతో, చెల్లితో కలిసి గడిపేందుకు స్వగ్రామమైన నరసింహుని పల్లెకు వచ్చాడు. సెలవులు పూర్తికావడంతో తిరిగి కళాశాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటూ ఉండగా, బుధవారం తన స్కూటీపై కొమరోలు వచ్చి ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకొని తిరిగి గోపానిపల్లె మీదుగా నరసింహుని పల్లెకు వెళు తున్నాడు. మార్గమధ్యంలో గోపానిపల్లె- బాదినేని పల్లె మధ్య రోడ్డుపై నరసింహ పల్లె గ్రామానికి చెందిన ఇమ్మడి చంద్రశేఖర్ తన మోటార్ బైక్ పై నరసింహుని పల్లె నుంచి కొమరోలుకు అతివేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న స్కూటర్ ను బలంగా ఢీకొన్నాడు. ఆ ప్రమాదంలో స్కూటర్ నడుపుతున్న నితీష్ రెడ్డి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహంపై పడి విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. దసరా సెలవులు సంతోషంగా ముగించుకొని తిరిగి కళాశాలకు వెళ్లవలసిన కుమారుడు నితీష్ రెడ్డి అకాల మరణం చెందడాన్ని తల్లిదండ్రులు వారి బంధుమిత్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. అల్లారుముద్దుగా పెంచుకొని బీటెక్ చదివిస్తూ కుమారునిపై గంపేడు ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు తీవ్ర దుఃఖ సాగరంలో మునిగిపోయారు. వారిని ఓదార్చడం కష్టతరమైందని ఆ గ్రామస్తులు తెలిపారు. మృతుని తండ్రి నేలటూరి అంకిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుడు నితీష్ రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుని తల్లిదండ్రులకు అప్పగించామని కొమరోలు ఎస్సై కే నాగేంద్ర రావు తెలిపారు. కాగా గురువారం నితీష్ రెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించగా,తల్లిదండ్రు రులు, బంధుమిత్రులు, పలు పార్టీల నేతలు కన్నీటి వీడ్కోలు పలికారు.

అవినీతి రహిత పాలనే నా లక్ష్యం

స్వతంత్ర చైర్మన్ అభ్యర్థిని గోళ్ల అపర్ణ

మార్కాపురం, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29

మార్కాపురం మున్సిపాలిటీలో అవినీతి రహిత, పారదర్శక పాలన అందించడమే తన ఏకైక లక్ష్యమని, తన ఎన్నికల గుర్తు కెమెరా అని స్వతంత్ర అభ్యర్థిని గోళ్ళ అపర్ణ స్పష్టం చేశారు. గురువారం మార్కాపురం ప్రెస్ క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె తన భవిష్యత్ ప్రణాళికలను, లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మార్కాపురం మున్సిపాలిటీలో సామాన్య ప్రజలు తమ చిన్న చిన్న పనుల కోసం కూడా ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి పనికి అవినీతి రాజ్యమేలుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గెలిస్తే మున్సిపల్ కార్యాలయంలో ప్రజల పనుల్లో అవినీతికి పూర్తిగా అడ్డుకట్ట వేస్తానని, ఎటువంటి సిఫార్సులు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.మార్కాపురం పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య తాగునీటి కొరత అని పేర్కొన్న ఆమె, అధికారంలోకి వస్తే పట్టణానికి 24 గంటల తాగునీటి సరఫరా అందించేందుకు ప్రత్యేక ప్రణాళికతో పని చేస్తానన్నారు. మార్కాపురం పట్టణ చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన పురాతన చెరువు కట్ట అభివృద్ధి తన ప్రధాన ప్రాధాన్యతల్లో ఒకటని అపర్ణ వెల్లడించారు. దాదాపు ఒకటిన్నర కిలోమీటరు మేర ఉన్న చెరువు కట్టను ఆధునిక హంగులతో, వాకింగ్ ట్రాక్, లైటింగ్ సౌకర్యంతో అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. దీనివల్ల పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పట్టణానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందని అభిప్రాయపడ్డారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు మాత్రమే కాదని, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా అంతే ప్రాధాన్యత ఇస్తానని ఆమె పేర్కొన్నారు. చివరిగా ఆమె మాట్లాడుతూ తాను ఏ పార్టీకి చెందిన వ్యక్తిని కాదని, పూర్తిగా ప్రజల మనిషినని, ప్రజా సమస్యల పరిష్కారం, మార్కాపురం పట్టణ సమగ్ర అభివృద్ధి కోసమే తాను బరిలోకి దిగానని తెలిపారు. కాబట్టి పట్టణ ప్రజలంతా తనను ఆశీర్వదించి తన ఎన్నికల గుర్తు అయిన కెమెరా గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని గోళ్ళ అపర్ణ విజ్ఞప్తి చేశారు.

కూటమి అభ్యర్థులకు మద్దతుగా పుత్తా కృష్ణచైతన్య ప్రచారం

సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 29:

పులివెందుల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా కామలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థితో పాటు 24వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి విజయానికి కూటమి నాయకులు ప్రజల్లోకి వెళ్లి మద్దతు కోరారు. ఈ సందర్భంగా పుత్తా కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ, ఓటర్లు సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ప్రజల మద్దతుతో కూటమి అభ్యర్థులకు విజయం అందించాలని కోరారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో కూటమి నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ ఓటర్లను కలుస్తున్నారు.

నాలుగు పునరావాస కేంద్రాల్లో 94 మంది

తుపాను ముప్పు నేపథ్యంలో ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించిన ప్రజలకు జీవీఎంసీ పునరావాస కేంద్రాల్లో ఆహారం, వసతి కల్పించింది. పరిస్థితులు అనుకూలించడంతో పలువురు తమ ఇళ్లకు చేరుకోగా, గురువారం నాటికి నార్త్, వెస్ట్ జోన్ల పరిధిలోని నాలుగు పునరావాస కేంద్రాల్లో 94 మంది ఆశ్రయం పొందుతున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు కమిషనర్ సూచించారు.

కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కేతన్ గార్గ్ తెలిపారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నగరంలో సాధారణ పరిస్థితులు పునరుద్ధరించే వరకు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, చెట్ల తొలగింపు, రహదారుల మరమ్మతులు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జీవీఎంసీ అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య, పర్యవేక్షక ఇంజినీర్ ఏ. శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో కూటమి అభ్యర్థుల ప్రచార జోరు

ముమ్మిడివరం, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29

ముమ్మిడివరం నగర పంచాయతీ కూటమి చైర్ పర్సన్ (జనసేన) అభ్యర్థి గుబ్బల రత్న భవాని వెంకటేశ్వరరావు, 15వ వార్డు కూటమి కౌన్సిలర్ అభ్యర్థి (టీడీపీ) రెడ్డి సుబ్బారావు, 16వ వార్డు కూటమి కౌన్సిలర్ అభ్యర్థి (టీడీపీ) సరిపల్లి వెంకట సుబ్బరాజు ప్రచారంలో ముమ్మిడివరం నియోజకవర్గ పరిశీలకురాలు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని తిరుమల కుమార్ పాల్గొన్నారు. వార్డుల్లో పర్యటిస్తూ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో అయ్యప్ప మాల వేసిన విద్యార్థులపై పరస్పర దాడులు

మాల వేసిన విద్యార్థులని కూడా లేకుండా పలుమార్లు కర్రలతో దాడి

తప్పు చేయకుండా ఎందుకు కొడుతున్నారు సార్ అని అడిగిన విద్యార్థిపై కూడా దాడి చేయబోయిన ఉపాధ్యాయుడు

సంతమాగులూరు, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29

సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొంతమంది హిందువుల విద్యార్థులు తల్లిదండ్రుల వారి ఆచార మొక్కుబడుల కోసం అయ్యప్ప మాల వేయడం ప్రతి సంవత్సరం జరుగుతుంది. అయితే వారిపట్ల కొంతమంది ఉపాధ్యాయులు దురుసుగా ప్రవర్తిస్తున్నరని ముఖ్యంగా బయాలజీ బోధించే ప్రసాద్ అనే ఉపాధ్యాయులు అయ్యప్ప మాలవేసిన విద్యార్థుల పట్ల పలుమార్లు చేతులతో కర్రలతో దాడి చేయడం జరిగింది. అయితే ఆ విద్యార్థులు తమ పెద్దవారికి తెలపగా ఆ విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి చెప్పినప్పటికీ ఈ దాడి జరగడం ఆగలేదు. చిన్న విద్యార్థులు కావడంతో విద్యార్థులు గురుస్వాములతో ఈ విషయాలన్నీ తెలపటం జరిగింది విషయం తెలుసుకున్న స్వాములు శుక్రవారం స్కూలు దగ్గర ధర్నాకి దిగుతామని సదర్ మీడియా ద్వారా తెలిపారు. ఈ విషయంపై పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు గారితో మాట్లాడగా ప్రసాద్ ఉపాధ్యాయుల వారిని పలుమార్లు మందలించడం జరిగిందిని అయినప్పటికీ ఆయన వినడం లేదని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.కె కాసిం సైదులు తెలిపారు.

గిద్దలూరులో మున్సిపల్ ఎన్నికల వేడి..

విజిలెన్స్ అధికారి ఎన్. అశ్వనీ కుమార్ ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు!

గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29

గిద్దలూరు మున్సిపాలిటీ ఎన్నికల సమరానికి వేళవుతుండటంతో అధికార యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది. ఎన్నికల ప్రచారాలు, కదలికలపై నిఘా పెంచిన విజిలెన్స్ అధికారులు పట్టణంలో వాహనాల తనిఖీలను మరింత ముమ్మరం చేశారు. ఎన్నికల్లో అక్రమ నిధులు, అసాంఘిక కార్యకలాపాలు, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు జరిగే అనధికార నగదు లేదా బహుమతుల రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ప్రధాన రహదారులు, సరిహద్దు చెక్పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు విజిలెన్స్ అధికారి ఎన్. అశ్వనీ కుమార్ తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా అన్ని ముందస్తు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, తనిఖీలు మునుముందు మరింత కఠినతరం చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో గిద్దలూరు ఏఎస్సై జిలానీ, సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు

కొనకనమిట్ల, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 29

రానున్న ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని కనిగిరి డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు.ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.ఇందులో భాగంగా మండలంలోని సమస్యాత్మక గ్రామమైన వాగుమడుగులో డీఎస్పీ శ్రీనివాసరావు,సీఐ రాజేష్ సమక్షంలో గురువారం పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో రాజకీయ కక్షలు,ఘర్షణలకు దూరంగా ఉండాలని,గ్రామంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడకూడదని పోలీసులు సూచించారు.రాజకీయ పార్టీల నాయకులు,కార్యకర్తలు ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం,ఇతరులపై ఒత్తిడి తీసుకురావడం వంటి చర్యలకు పాల్పడకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో పాల్గొనాలని సూచించారు.సమస్యాత్మక గ్రామాల్లో ముందస్తు అవగాహన కార్యక్రమాల ద్వారా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఎన్నికల సమయంలో ప్రజలు సంయమనం పాటిస్తూ పోలీసులకు సహకరించాలని,ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా,శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ శ్రీకాంత్,సిబ్బంది పాల్గొన్నారు.

అజ్ఞాతవాసి దెబ్బ.. మళ్లీ అలా ఎందుకు చేస్తారు?

మాలవికా మోహనన్ పండుగ వేళ ధరించిన దుస్తుల్లో కాలాతీతమైన సాంప్రదాయ సొగసు వెల్లివిరిసింది

ఒకసారి ఎదురైన చేదు అనుభవాన్ని అంత త్వరగా మర్చిపోవడం ఎవరికైనా కష్టమే. ముఖ్యంగా వందల కోట్ల బిజినెస్ జరిగే సినిమా విషయంలో పొరపాటు జరిగితే దాని ప్రభావం చాలా కాలం ఉంటుంది. దర్శకుడు త్రివిక్రమ్ కూడా గతంలో అలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నారు. ఇప్పుడు వెంకటేష్‌తో తీసిన 'ఆదర్శ కుటుంబం'పై కాపీ ప్రచారం మొదలవడంతో ఎనిమిదేళ్ల క్రితం జరిగిన ఓ వివాదం మళ్లీ గుర్తుకొస్తోంది. అయితే అప్పట్లో ఎదురైన దెబ్బ తర్వాత త్రివిక్రమ్ మళ్లీ అదే తరహా రిస్క్ తీసుకుంటారా అనేది ఆలోచించాల్సిన విషయం.2018లో పవన్ కళ్యాణ్‌తో త్రివిక్రమ్ తెరకెక్కించిన 'అజ్ఞాతవాసి' విడుదలకు ముందే కాపీ ఆరోపణలు ఎదుర్కొంది. ఫ్రెంచ్ సినిమా 'లార్గో వించ్' కథను పోలి ఉందంటూ అప్పట్లో పెద్ద వివాదమే నడిచింది. ఆ సినిమా రీమేక్ హక్కులు కలిగిన టీ సిరీస్‌తో కాపీరైట్ వ్యవహారం కూడా తెరపైకి వచ్చింది. చివరకు ఆ సమస్యను పరిష్కరించుకున్నట్లు వార్తలు వచ్చాయి. కానీ భారీ అంచనాలతో విడుదలైన 'అజ్ఞాతవాసి' బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా నిరాశపరిచింది.ఆ ఫ్లాప్ త్రివిక్రమ్‌ను ఆర్థికంగానూ ఇబ్బంది పెట్టింది. సినిమా నష్టాల కారణంగా తన రెమ్యునరేషన్ తిరిగిచ్చినట్లు స్వయంగా చెప్పారు. నిర్మాత, పవన్ కళ్యాణ్‌తో కలిసి డిస్ట్రిబ్యూటర్ల నష్టాలను భర్తీ చేసిన విషయాన్ని కూడా వెల్లడించారు. ఇటీవల మరోసారి ఆ రోజుల గురించి మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో కట్టుకుంటున్న ఇంటిని అమ్మేయాలని కూడా అనుకున్నట్లు గుర్తుచేసుకున్నారు. అంత పెద్ద సినిమా ఫెయిలైతే పరిస్థితి ఎంతవరకు వెళ్తుందో త్రివిక్రమ్‌కు అప్పుడే అనుభవమైంది.ఇప్పుడు 'ఆదర్శ కుటుంబం' విషయంలోనూ తమిళ చిత్రం 'బ్లాస్ట్' పేరు వినిపిస్తోంది. అర్జున్ నటించిన ఆ సినిమాలో మాదిరిగానే వెంకటేష్ సినిమాలోనూ ఒక కుటుంబానికి నేరస్తుల నుంచి ప్రమాదం ఎదురవుతుందని కొందరు పోలుస్తున్నారు. దీనిపై త్రివిక్రమ్, వెంకటేష్ ఇప్పటివరకు ప్రత్యేకంగా స్పందించలేదు. కానీ హీరోయిన్ శ్రీనిధి శెట్టి మాత్రం క్లారిటీ ఇచ్చింది. తాను 'బ్లాస్ట్' చూశానని, ఆ సినిమాకు 'ఆదర్శ కుటుంబం'తో ఎలాంటి సంబంధం లేదని చెప్పింది.

పైగా ఈసారి త్రివిక్రమ్ పనిచేస్తున్నది కూడా 'అజ్ఞాతవాసి' నిర్మించిన హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌లోనే. నిర్మాత రాధాకృష్ణకు అప్పటి నష్టాల గురించి తెలుసు. అలాంటి అనుభవం ఉన్న దర్శకుడు, నిర్మాత మళ్లీ అదే తరహా వివాదానికి అవకాశం ఇచ్చే కథను ఎందుకు ఎంచుకుంటారనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. అయితే 'ఆదర్శ కుటుంబం' ట్రైలర్‌లో చూపించిన కొన్ని సన్నివేశాల ఆధారంగానే ప్రస్తుతం ఈ పోలికలు వస్తున్నాయి. ఏదేమైనా త్రివిక్రమ్ మళ్ళీ అలాంటి పరిస్థితికి ఏమాత్రం చాన్స్ ఇవ్వరు అనేది కొందరు చెబుతున్న మాట. ఇక సినిమా రిలీజ్ తర్వాత కథ ఎలా ఉంటుందో చూడాలి.

బ్రౌన్ రంగు దుస్తుల్లో మోనోక్రోమ్ ఫ్యాషన్‌కు కొత్త మెరుగులు దిద్దిన అయేషా ఖాన్

పాక్ బౌలర్లకు ఆ టాలెంటే లేదు.. బుమ్రా ముందు వాళ్లంతా వేస్ట్

పాకిస్తాన్ క్రికెట్ అనగానే ఒకప్పుడు భీకరమైన ఫాస్ట్ బౌలర్లు గుర్తుకొచ్చేవాళ్ళు.. కానీ కాలం మారింది, ఇప్పుడు పాక్ క్రికెట్ పరిస్థితి దయనీయంగా తయారైంది. సరిగ్గా ఇదే విషయాన్ని పాకిస్తాన్ మాజీ పేసర్ వకార్ యూనిస్ ఓ పోడ్‌కాస్ట్‌లో బయటపెట్టాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో టీమిండియా పేస్ గన్ జస్‌ప్రీత్ బుమ్రా దెబ్బకు పాక్ బౌలర్లు ఎక్కడా నిలవలేరని, అసలు బుమ్రా దరిదాపుల్లోకి కూడా ఎవరూ రాలేరని కుండబద్దలు కొట్టాడు. పాకిస్తాన్ మాజీ ఆటగాడే స్వయంగా ఇండియన్ ప్లేయర్ల గొప్పతనాన్ని ఒప్పుకోవడం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

పాక్‌కు ఆ తలరాత లేదు.. బుమ్రాతో పోలికేంటి?:

పాకిస్తాన్ బౌలర్లు తమ జట్టును ఎప్పుడూ గెలిపించలేకపోతున్నారని పరోక్షంగా ఎద్దేవా చేస్తూ వకార్ యూనిస్ అసలు నిజాలని బయట పెట్టాడు.

పాక్ పై బుమ్రా పగడపు కోట: 2024 టీ20 వరల్డ్ కప్‌లో న్యూయార్క్‌లో పాకిస్తాన్ గెలవాల్సిన మ్యాచ్‌ను బుమ్రా ఒక్కడూ ఎలా తిప్పికొట్టాడో వకార్ గుర్తుచేసుకున్నాడు. పాకిస్తాన్ ఆ మ్యాచ్ కోల్పోవడానికి అసలు కారణమే లేదు.. కానీ బుమ్రా దెబ్బకు రిజ్వాన్ అండ్ కో పెవిలియన్ చేరింది. పాక్ కెప్టెన్‌కు కష్టమొస్తే ఎవరో దిక్కుతోచదు.. కానీ రోహిత్ శర్మ మాత్రం బంతిని టక్కున బుమ్రా చేతిలో పెట్టి మ్యాచ్ గెలిపిస్తాడు అంటూ పాక్ బౌలర్ల అసమర్థతను ఎత్తిచూపాడు.

వైట్ బాల్ కింగ్: వైట్ బాల్ క్రికెట్‌లో జస్ప్రీత్ బుమ్రా లెవెలే వేరని, ఒత్తిడిలో మ్యాచ్‌లను మలుపు తిప్పే దమ్ము ఒక్క బుమ్రాకే ఉందని వకార్ కితాబిచ్చాడు.

టెస్టుల్లో బుమ్రాపై వకార్ కౌంటర్:

వైట్ బాల్‌లో బుమ్రాను పొగిడిన వకార్.. టెస్టుల విషయానికి వచ్చేసరికి తనలోని పాకిస్తానీ నైజాన్ని బయటపెట్టాడు. ఆస్ట్రేలియాకు చెందిన మిచెల్ స్టార్క్, జోష్ హేజెల్‌వుడ్‌లతో బుమ్రాను పోలుస్తూ.. టెస్టుల్లో బుమ్రా ఇంకా చాలా నిరూపించుకోవాలి, ఎందుకంటే అతను ఆస్ట్రేలియా పేసర్ల అంత మ్యాచ్‌లు ఆడలేదంటూ కాస్త తక్కువ చేసే ప్రయత్నం చేశాడు.

ఇండియన్ ఫ్యాన్స్ సెటైర్స్:

అయితే, వకార్ యూనిస్ చేసిన ఈ వ్యాఖ్యలపై భారత క్రికెట్ అభిమానులు సోషల్ మీడియాలో సెటైర్లు పేలుస్తున్నారు. పాకిస్తాన్‌లో దశాబ్దాలుగా ఆడితేనేం.. ఆస్ట్రేలియాలో ఒక్క టెస్టు సిరీస్ గెలవలేని పాక్ ప్లేయర్స్, మా బుమ్రా గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లే అంటూ గట్టిగానే కౌంటర్ ఇస్తున్నారు. ఏది ఏమైనా, పాక్ మాజీ దిగ్గజమే స్వయంగా ఇండియన్ పేసర్ల దమ్మును ఒప్పుకోవడం ఇక్కడ అసలు విశేషం.

జస్‌ప్రీత్ బుమ్రా కెరీర్:

టెస్టులు: 52 మ్యాచ్‌లు । 234 వికెట్లు । 19.7 సగటు । 42.8 స్ట్రైక్ రేట్

వన్డేలు: 91 మ్యాచ్‌లు । 151 వికెట్లు । 23.7 సగటు

టీ20లు: 100 మ్యాచ్‌లు । 126 వికెట్లు । 6.53 ఎకానమీ

టీమిండియా టీ20 జట్టుతో కలిసి శుభ్‌మన్ గిల్ ప్రాక్టీస్.. అసలేం జరుగుతోంది?

భారత వన్డే, టెస్టు జట్ల కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ రోజు (2026, అక్టోబర్ 29, గురువారం) ఆక్లాండ్ చేరుకున్నాడు. రాబోయే సుదీర్ఘ న్యూజిలాండ్ పర్యటనలో వన్డే, టెస్టు జట్లను నడిపించేందుకు కివీస్ చేరుకున్న గిల్, ఏమాత్రం ఆలస్యం చేయకుండా నేరుగా ఈడెన్ పార్క్ మైదానంలో టీమిండియా టీ20 జట్టు ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొని అందరినీ షాక్ కి గురి చేశాడు.

ఆక్లాండ్ వేదికగానే వన్డే సిరీస్ స్టార్ట్:

నవంబర్ 4వ తేదీ నుంచి ఆక్లాండ్ వేదికగా 5 మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం కానుండగా, నవంబర్ 19 నుంచి వెల్లింగ్టన్‌లో 2 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. ఇప్పటికే టీ20 సిరీస్‌ను 3--0తో దక్కించుకున్న భారత జట్టు నెట్ సెషన్‌లో తన పంజాబ్ టీమ్‌మేట్ అభిషేక్ శర్మ తో కలిసి గిల్ సుదీర్ఘంగా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు.

ఐపీఎల్‌లో 732 రన్స్.. టీ20 జట్టులో గిల్ కి నో ఛాన్స్:

ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున 16 మ్యాచ్‌ల్లో 163.02 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 732 పరుగులు (1 సెంచరీ, 6 హాఫ్ సెంచరీలు) సాధించినప్పటికీ, ప్రస్తుతం భారత టీ20 జట్టులో గిల్‌కు చోటు దక్కలేదు. జట్టులో తీవ్ర పోటీ టీ20 జట్టులో ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజు శాంసన్, 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీలు ఫామ్‌లో ఉండటంతో గిల్‌కు టీ20 జట్టులో కాంపిటీషన్ పెరిగింది. డిసెంబర్ 2025లో ధర్మశాలలో దక్షిణాఫ్రికాపై గిల్ చివరి టీ20 ఆడాడు.2027 వరల్డ్ కప్ కెప్టెన్సీ: 2027 వన్డే వరల్డ్ కప్‌లో టీమిండియాను నడిపించనున్న 27 ఏళ్ల గిల్‌ను బీసీసీఐ వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కింద జాగ్రత్తగా కాపాడుకుంటోంది. రాబోయే వన్డే, టెస్టు సిరీస్‌లకు ఆయనే కెప్టెన్ కావడంతో టీ20ల నుంచి విశ్రాంతి ఇచ్చారు.

వన్డేల్లో శుభ్‌మన్ గిల్ రేర్ రికార్డ్:

వన్డే ఫార్మాట్‌లో ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడిగా కొనసాగుతున్న శుభ్‌మన్ గిల్ రికార్డులు చాలా అద్భుతంగా ఉన్నాయి.

పరుగులు: 70 మ్యాచ్‌ల్లో 3,713 పరుగులు

సగటు (బాజవతీభుస్రవ): 64.01

స్ట్రైక్ రేట్: 103.31

సెంచరీలు/హాఫ్ సెంచరీలు: 11 శతకాలు, 20 అర్ధ శతకాలు!

4-0 కోసం టీమిండియా గురి.. కుల్దీప్, వరుణ్‌కు ఛాన్స్? న్యూజిలాండ్‌కు మరో షాక్ తప్పదా!

న్యూజిలాండ్ గడ్డపై భారత క్రికెట్ జట్టు మరో విజయానికి సిద్ధమైంది. ఇప్పటికే ఐదు టీ20ల సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకున్న టీమిండియా.. రేపు ఆక్లాండ్‌లో జరిగే నాలుగో టీ20లోనూ గెలిచి ఆధిక్యాన్ని 4-0కు పెంచాలని పట్టుదలగా ఉంది. మరోవైపు వరుస పరాజయాలతో సతమతమవుతున్న న్యూజిలాండ్.. సత్తా చాటాలని చూస్తోంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలుపుతో పాటు జట్టులోని రిజర్వ్ ఆటగాళ్లకు అవకాశాలు దక్కుతాయా? అనే ఆసక్తి కూడా నెలకొంది.

కుల్దీప్, వరుణ్‌కు అవకాశం దక్కేనా?

సిరీస్ ఇప్పటికే భారత్ చేతిలోకి రావడంతో తుది జట్టులో ప్రయోగాలు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తికి అవకాశం కల్పించే అంశాన్ని టీమ్ మేనేజ్‌మెంట్ పరిశీలించవచ్చు. బ్యాటింగ్‌ను ఎనిమిదో స్థానం వరకు బలోపేతం చేస్తూ భారత్ ఆడుతున్న విధానం ఇప్పటివరకు మంచి ఫలితాలనే ఇచ్చింది. అయితే నాలుగో టీ20లో అక్షర్ పటేల్ లేదా అద్భుత ఫామ్‌లో ఉన్న నమన్ ధీర్‌కు విశ్రాంతినిస్తే.. కుల్దీప్ లేదా వరుణ్ తుది జట్టులోకి వచ్చే అవకాశముంది. న్యూజిలాండ్‌పై కుల్దీప్ రికార్డు కూడా అతడికి అనుకూలంగా ఉంది. ముఖ్యంగా గ్లెన్ ఫిలిప్స్‌ను ఐదు ఇన్నింగ్స్‌ల్లో నాలుగుసార్లు అవుట్ చేశాడు. అక్షర్ కూడా ఫిలిప్స్‌ను ఐదుసార్లు పెవిలియన్‌కు పంపాడు. దీంతో భారత స్పిన్నర్ల ఎంపిక ఈ మ్యాచ్‌లో ఆసక్తికరంగా మారింది. ఈ సిరీస్‌లో భారత బ్యాటర్లు ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతున్నారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ విధ్వంసకర ఫామ్‌లో ఉన్నాడు. వెల్లింగ్టన్‌లో కేవలం 35 బంతుల్లోనే సెంచరీ సాధించి న్యూజిలాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అంతర్జాతీయ టీ20ల్లో అతడికది నాలుగో సెంచరీ. టీ20 క్రికెట్లో అతడికి 11వ శతకం కాగా, భారత బ్యాటర్లలో టీ20ల్లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా నిలిచాడు.2025 నుంచి టీ20ల్లో అభిషేక్ 200.6 స్ట్రైకరేట్‌తో పరుగులు సాధిస్తుండటం అతడి దూకుడుకు నిదర్శనం.

న్యూజిలాండ్ బౌలర్లు జాకబ్ డఫీ, కైల్ జేమీసన్‌పై కూడా అతడు భారీ స్ట్రైక్‌రేట్లతో పరుగులు చేశాడు. మరోవైపు ఇషాన్ కిషన్ గాయం నుంచి కోలుకోకపోతే వైభవ్ సూర్యవంశీకి మరో అవకాశం దక్కవచ్చు. అభిషేక్‌తో కలిసి అతడు ఎలా ఆడతాడన్నది అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది.

గాయాలతో న్యూజిలాండ్‌కు కష్టాలు

భారత్‌ను నిలువరించడంలో న్యూజిలాండ్ బౌలర్లు విఫలమవుతున్నారు. ఇప్పటికే హెన్రీ అందుబాటులో లేకపోగా, కాలి కండరాల గాయంతో లాకీ ఫెర్గూసన్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. వెల్లింగ్టన్‌లో పవర్‌ప్లేలోనే భారత్ రికార్డు స్థాయిలో 118 పరుగులు సాధించడం కివీస్ బౌలింగ్ వైఫల్యాన్ని స్పష్టం చేసింది.కెప్టెన్ మిచెల్ శాంట్నర్ బంతితో రాణిస్తున్నా.. మిగతా బౌలర్ల నుంచి తగిన సహకారం లభించడం లేదు. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ బ్యాటర్లకు అనుకూలంగా ఉండటంతో భారత బ్యాటింగ్‌ను కట్టడి చేయడం కివీస్‌కు పెద్ద సవాలే.

ఈడెన్ పార్క్‌లో ప్రేక్షకుల రికార్డు!

ఈ మ్యాచ్‌కు దాదాపు 40 వేల మంది ప్రేక్షకులు హాజరవుతారని అంచనా. న్యూజిలాండ్‌లో ద్వైపాక్షిక సిరీస్ మ్యాచ్‌కు ఇదే అత్యధిక ప్రేక్షకుల హాజరుగా నిలిచే అవకాశం ఉంది. 2019లో ఇదే వేదికపై భారత్ పురుషుల, మహిళల జట్ల మ్యాచ్‌లకు కలిపి నమోదైన 36,523 మంది హాజరు రికార్డును ఈసారి అధిగమించే అవకాశం ఉంది. టీ20ల్లో న్యూజిలాండ్‌పై భారత్ ఇప్పటివరకు 34 మ్యాచ్‌లు ఆడగా 22 విజయాలు సాధించింది. కివీస్‌పై వరుస విజయాలతో దూసుకెళ్తున్న భారత్.. ఈ మ్యాచ్‌లోనూ గెలిస్తే తమ ఆధిపత్యాన్ని మరింత పెంచుకుంటుంది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776